మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 17-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 229 Issue: 229


Published from Jagitial
www.evarthalu.com

17 ఫిబ్రవరి 2026 - మంగళవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:45 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి అమావాస్య సా. 5:27 వరకు తరువాత పాడ్యమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం ధనిష్ఠ రా. 9:04 వరకు తరువాత శతభిష యోగం పరిఘ రా. 12:20 వరకు కరణం నాగవ సా. 5:27 వరకు స్తుష్నమ తె. 5:17 వరకు వర్జ్యం తె. 4:28 నుండి ఉ. 6:04 వరకు దుర్ముహూర్తం ఉ. 9:03 నుండి ఉ. 9:49 వరకు రా. 11:14 నుండి రా. 12:04 వరకు రాహుకాలం మ. 3:22 నుండి సా. 4:48 వరకు యమగండం ఉ. 9:37 నుండి ఉ. 11:04 వరకు గుళికాకాలం మ. 12:30 నుండి మ. 1:56 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:09 నుండి తె. 5:57 వరకు అమృత ఘడియలు ఉ. 10:39 నుండి మ. 12:17 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:53 వరకు

# రాహుల్ నాకు నచ్చడు

## నేను రాహులియన్‌ను కాదు

**కేరళలో కాంగ్రెస్‌కు అధికారం కల్ల.. కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్**



రాహుల్ గాంధీ అంటే తనకు ఇష్టం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను రాహులియన్‌ను కాదని స్పష్టం చేశారు. 'నేను వందశాతం గాంధేయవాదిని. నెహ్రూ, రాజీవ్‌కు శిష్యుడిని. కానీ.. రాహుల్‌కు కాదు' అని తేల్చి చెప్పారు. ఓ ఆంగ్ల చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అయ్యర్ మాట్లాడుతూ.. కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, పవన్ ఖేరా పనికిమాలిన నేతలు అని తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. కేసీ వేణుగోపాల్ ఒక వీధి రౌడీ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

తిరువనంతపురం: పార్టీ నేతలు కమ్యూనిస్టులపై చూపించే ద్వేషం కంటే ఎక్కువగా ఒకరినొకరు ద్వేషించుకుంటారని, ఆ కారణంగానే రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం లేదని అన్నారు. పవన్ ఖేరా పార్టీ ప్రతినిధి కాదని, ఒక కీలు బొమ్మ అని విమర్శించారు. పవన్ ఖేరా కాకుండా మరో వ్యక్తి ఎవరూ కాంగ్రెస్‌కు దొరకని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఏ స్థితిలో ఉందో, ఆ స్థితిలోనే ఉంటుందని అన్నారు. కేరళలో పార్టీ విజయావకాశాలపై అడిగినప్పుడు 'కాంగ్రెస్ గెలవాలన్నదే నా కోరిక. కానీ కాంగ్రెస్ పార్టీ నేతలు విడిపోయినందున కాంగ్రెస్ గెలుపు సాధిస్తుందని నమ్మడం లేదు. కమ్యూనిస్టులను ద్వేషించే దాని కంటే ఎక్కువగా వాళ్లు ఒకరినొకరు ద్వేషించుకుంటారు' -2 వ పేజీలో...

# ఉండాల్నా.. పోవాల్నా?

**పార్టీ ఫిరాయిస్తే అభివృద్ధి సాధ్యమా?**

## ఇంకెంత కాలం ఈ అవమానాలు?

**మాకెందుకు ఇంత మానసిక క్షోభ?.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కింద పనిచేయాల్నా?**

**మాజీమంత్రి జీవన్ రెడ్డి తీవ్ర ఆవేదన.. ఎమ్మెల్యే సంజయ్‌పై విమర్శలు**

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఎమ్మెల్యే సంజయ్ వర్గానికి దక్కడంపై మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి భగ్గుమన్నారు. అసలు పార్టీలో ఉండాలా? పోవాలా? అని అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. తమకు ఇంకెంత కాలం ఈ అవమానాలు అని నిట్టూర్చారు.

జగిత్యాల బ్యూరో, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వెళ్లగక్కారు. 'కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ ఆధిక్యాన్ని ప్రదర్శిస్తు న్నారు. కాంగ్రెస్ కు సంబంధం లేని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జోక్యంతో పార్టీ కార్యకర్తలు తమ హక్కులు కోల్పోయారు. విధిలేని పరిస్థితిలో స్వతంత్రులుగా బరిలో నిలిచారు. వారికి ప్రచారం నిర్వహించిన. జగిత్యాల మున్సిపాలిటీ ఎన్నికల్లో 23 మంది బీ ఫారం మీద గెలిచారు. మరో ఇద్దరికి తరువాయి 2 వ పేజీలో...

## జేఈఈ మెయిన్‌లో తెలుగోళ్ల సత్తా

**ముగ్గురు తెలుగు విద్యార్థులకు 100 పర్సెంటైల్**

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తాచాటారు. సోమవారం సాయంత్రం విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాల్లో ముగ్గురు తెలుగు విద్యార్థులు ప్రతిభ చాటారు. 100 పర్సెంటైల్ -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,644 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,988 |

# కాంగ్రెస్‌కు 84 మున్సిపాలిటీలు

**11 చోట్ల తేలని ఫలితాలు**



**బీఆర్ఎస్‌కు 17, బీజేపీకి 1.. మూడు చోట్ల స్వతంత్ర అభ్యర్థులు**

**హస్తం పార్టీకి 5 కార్పొరేషన్లు.. ఎట్టకేలకు బీజేపీకే కరీంనగర్**

తెలంగాణలో ఐదు కార్పొరేషన్లను, 84 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. బీజేపీ, సీపీఐ పార్టీలు చెరో కార్పొరేషన్‌ను దక్కించుకోగా, బీఆర్ఎస్‌కు 17 మున్సిపాలిటీలు దక్కాయి. బీజేపీకి 1 మున్సిపాలిటీ, 3 చోట్ల స్వతంత్రులు కైవసం చేసుకున్నారు. కోరం లేకపోవడం వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. ఈనెల 11వ తేదీన మొత్తం 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా.. ఈనెల 13వ తేదీన వెలువడ్డాయి.

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

చాలా ప్రాంతాల్లో హంగ్ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఏర్పడటంతో.. అక్కడ ఎవరు మేయర్, చైర్మన్ పీఠాలను దక్కించుకుంటారు అనే ఉత్కంఠ కొనసాగింది. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత మేయర్, చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. వేర్వేరు కారణాల వల్ల రాష్ట్రంలోని 11 పురపాలికల్లో చైర్మన్ ఎన్నిక ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఈ వాయిదా పడిన 11 మున్సిపాలిటీల్లో జనగామ, ఇల్లందు, సుల్తానాబాద్, కాగజ్‌నగర్, ఇబ్రహీంపట్నం, కేతనపల్లి, జహీరాబాద్, ఖానాపూర్, ఇంద్రేశం, డోర్నకల్, తొర్రూరు ఉన్నాయి. ఈ 11 మున్సిపాలిటీల్లో తిరిగి ఎప్పుడు చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారనేది ఇంకా ఎన్నికల అధికారులు క్లారిటీ ఇవ్వలేదు. మంగళవారం ఈ ప్రక్రియ -2 వ పేజీలో...



# పెళ్లికి ముందే సెక్స్ ఏంటో?

**అదెలా సాధ్యమో అర్థం కావట్లేదు**

**లైంగిక సంబంధాలపై జాగ్రత్త లేదా?**

**పెళ్లికి ముందు ఎలా నమ్ముతున్నారు?**

**ఇప్పుడొచ్చి రేప్ చేశాడంటే ఎలా?**

**సుప్రీం కోర్టు ఘాటు వ్యాఖ్యలు**

పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సర్వోన్నత న్యాయస్థానం ఘాటుగా స్పందించింది. వివాహానికి ముందు లైంగిక సంబంధంలోకి అడుగుపెట్టే ముందు చాలా జాగ్రత్తగా ఉండాలని, అసలు ఈ సంబంధాలు ఎలా సాధ్యమని, బహుశా తమవి పాతకాలపు ఆలోచనలేమోనని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడి బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనంపై విధంగా స్పందించింది.

న్యూఢిల్లీ: అప్పటికే వివాహమైన అతడు.. మరో మహిళకు పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక సంబంధం పెట్టుకుని, తర్వాత మరో మహిళను వివాహం చేసుకు న్నాడనేది ప్రధాన ఆరోపణ..ఆ వ్యక్తి బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న మాట్లాడుతూ... 'పెళ్లికి ముందు శారీరక సంబంధాలు విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలి.. బహుశా మనవి పాతకాలపు ఆలోచనలే కావచ్చు.. కానీ, పెళ్లికి ముందు అమ్మాయి, అబ్బాయి అపరిచితులే.. వారి సంబంధం ఎంత గాఢంగా ఉన్నా, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా పెళ్లికి ముందు లైంగిక సంబంధంలో తరువాయి 2 వ పేజీలో...

# ప్రపంచానికి 'మన' పరిష్కారం



**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌పై ప్రధాని మోదీ**

**జియో ఇంటెలిజెన్స్ పెవిలియన్ సందర్శన**

న్యూఢిల్లీ: 'ఆవిష్కరణలు, పరిశోధకులు, ఔత్సాహితకుల మధ్య ఉండటం వల్ల భారతీయ ప్రతిభ, ఏఐ సామర్థ్యం గురించి అవగాహన కలుగుతోంది. అందరం కలిసి అనేక సమస్యలపై మన దేశానికే కాకుండా, ప్రపంచానికి పరిష్కారాలను చూపుతాం' అని ప్రధాని మోదీ అన్నారు. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు'లో భాగంగా ఏర్పాటు చేసిన జియో ఇంటెలిజెన్స్ పెవిలియన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. అక్కడున్న వివిధ ఏఐ ఆధారిత నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ఏఐ ఎకోసిస్టమ్, ఆయా రంగాల్లో డిజిటల్ మార్పులను వేగవంతం చేయడంలో దాని పాత్ర గురించి ప్రధాని మోదీకి జియో ఛైర్మన్ ఆకాశ్ అంబానీ వివరించారు. జియో ఏఐ స్టాక్; జియో సంస్కృతి ఏఐ; జియో ఆరోగ్య తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



చైనా శాస్త్రవేత్తలు వెదురు బొంగులతో ప్లాస్టిక్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఉన్న పెట్రోలియం ఆధారిత ప్లాస్టిక్‌లాగే ఇది కూడా అధిక సామర్థ్యం కలిగినదే. అయితే, 50 రోజుల్లోనే భూమిలో కలిసిపోయే పర్యావరణహిత ప్లాస్టిక్ అది.



# 5 శాతానికి నిరుద్యోగం

పనిచేసే అవకాశం ఉన్న 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు పెరిగింది. కేంద్రం సోమవారం విడుదల చేసిన జనవరి నెల డేటా ప్రకారం.. నిరుద్యోగ రేటు 4.8 శాతం నుంచి 5 శాతానికి పెరిగింది.

# బిల్ గేట్స్.. క్విట్ ఇండియా

**భారత పర్యటన వేళ ట్రెండింగ్‌లో హ్యాష్‌ట్యాగ్.. అమరావతిని సందర్శించిన మైక్రోసాఫ్ట్ అధినేత**



న్యూఢిల్లీ: మైక్రోసాఫ్ట్ కో ఫౌండర్, గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ భారత పర్యటన వేళ నెట్టింట్లో 'క్విట్ ఇండియా' హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. గతంలో ఓ సందర్భంలో భారత్‌పై బిల్‌గేట్స్ తీవ్ర అభ్యంతకర వ్యాఖ్యలు చేశారు. ఇండియాని ఓ ప్రయోగశాలగా వాడవచ్చని అన్నారు. ఆ దేశంలో ఎటువంటి ప్రయోగాలయినా చేసుకోవచ్చని తెలిపారు. అంటే ఇక్కడి మట్టికి గానీ తరువాయి 2 వ పేజీలో...



## వరి బోనస్ బకాయిలు విడుదల

**పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్లు రిలీజ్**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. వరి బోనస్ బకాయి నిధులను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. దీంతో 2.17 లక్షల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వరి రైతులకు తరువాయి 2 వ పేజీలో...





# భారత పాస్‌పోర్టుకు 75వ ర్యాంక్

**హెన్లీ ఇండెక్స్ 2026 నివేదిక విడుదల**

## రాశి ఫలాలు

17.2.2026

మేషం: వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. సంతానం నుండి శుభవార్తలు వింటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: కుటుంబ వ్యవహారాలలో స్థిరమైన ఆలోచనలు చేసి మీ విలువ పెంచుకుంటారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి. దూర ప్రయాణాలు లాభిస్తాయి. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో ఆశించిన అభివృద్ధి కలుగుతుంది.

మిధునం: ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో ధన వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండడం మంచిది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. గృహనిర్మాణ ప్రయత్నాలు త్వరితగతిన పూర్తికావు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. నిరుద్యోగ యత్నాలు కలిసిరావు.

కర్కాటకం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహమున కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో నూతన ప్రోత్సహకాలు అందుకుంటారు. ఇతరుల నుండి అవసరానికి సహాయం అందుతుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభిస్తాయి.

సింహం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలగుతాయి. విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగమున అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. గృహమున బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సంతాన విద్యా విషయంలో శుభ వార్తలు అందుతాయి.

కన్య: ఆర్ధిక వ్యవహారాలు మరింత ఇబ్బంది కలిగిస్తాయి. జీవిత భాగస్వామితో మనస్పర్ధలు పెరుగుతాయి. గృహంలో చికాకులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

తుల: ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో స్థిరమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన నష్టపడతారు. నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు చేస్తారు. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది.

వృశ్చికం: సోదరుల సహాయంతో వివాదాల నుండి బయట పడతారు. బంధుమిత్రుల ఆగమనం సంతోషం కలిగిస్తుంది. ఆర్ధిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగస్థులకు పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఇంటా బయట కొందరి ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. కుటుంబ వ్యవహారాలలో సొంత నిర్ణయాలు తీసుకోరాదు. ఆలయ సందర్శన చేసుకుంటారు. ఉద్యోగమున అధికారులతో అప్రమత్తంగా ఉండాలి.

మకరం: ఆర్థికంగా పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో స్థిరమైన ఆలోచనలు చేసి లాభపడతారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది.

కుంభం: చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు రావు. ఋణ ప్రయత్నాలు కలిసిరావు. ఉద్యోగమున మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభించదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పత్రాల విషయంలో జాగ్రత్త వహించాలి.

మీనం: ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున బంధు మిత్రుల రాక ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది.

# ప్రపంచానికి 'మన' పరిష్కారం

మొదటి పేజీ తరువాయి

ఏఐ; జియో శిక్ష; జియో ఏఐ హోం వంటి ప్లాట్‌ఫాంల లైవ్ డెమోలను ప్రధాని వీక్షించారు. ఆరోగ్యం, విద్య, వ్యాపార రంగాలను బలోపేతం చేసేందుకు, భారతీయ భాషలు, సాంస్కృతిక కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు, ఏఐ ఆధారిత స్మార్ట్ లివింగ్‌ను పెంపొందించేందుకు వీటిని రూపొందించినట్లు ఆకాశ్ అంబానీ తెలిపారు. 'అందరికీ ఏఐ' అనే దార్శనికతను పునరుద్ఘాటిస్తూ.. అధునాతన సాంకేతికతలను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జియో సంస్థ తెలిపింది. తమ పెవిలియన్‌ను ప్రధాని సందర్శించడం.. దేశ ఏఐ రంగంలో విస్తరిస్తున్న ప్రైవేటు రంగం పాత్రను చాటిచెబుతోందని పేర్కొంది.

### 80 దేశాల ప్రతినిధులు హాజరు

ఈ సదస్సులో 80కి పైగా దేశాల నేతలు, 500 మందికి పైగా గ్లోబల్ ఏఐ నిపుణులు, సీఈఓలు, పరిశోధకులు పాల్గొంటున్నారు. సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చిస్తారు. గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఫిబ్రవరి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుంది. ఫిబ్రవరి 19న ప్రధాని మోదీ ప్రారంభోపన్యాసం చేస్తారు. సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ విజన్‌ను, ప్రపంచ దేశాల సహకారంపై ఆయన తన ప్రసంగంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, 60 మంది మంత్రులు, ఉప మంత్రులు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న 'ఏఐ ఫర్ ఆల్', 'ఏఐ బై హర్', 'యువ ఏఐ' పేర్లతో మూడు గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఛాలెంజ్‌లకు 60 దేశాల నుంచి 4,650కి పైగా అప్లికేషన్లు రావడం, బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందనడానికి నిదర్శనంగా నిపుణులు పేర్కొంటున్నారు.




### 25న ఇజ్రాయెల్‌కు మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ రెండురోజుల పర్యటన నిమిత్తం ఇజ్రాయెల్ వెళ్లనున్నారు. ఆ వివరాలను ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహూ స్వయంగా వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటనతో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ఇజ్రాయెల్ ప్రధాని ఆ దేశ పార్లమెంటులో ప్రసంగిస్తూ.. 'భారత ప్రధాని వచ్చేవారం (ఈ నెల 25న) ఇజ్రాయెల్ పర్యటనకు రానున్నారు. రెండు దేశాల మధ్య ప్రస్తుతం అద్భుతమైన సంబంధాలున్నాయి. ఇప్పుడు మరిన్ని అంశాలపై చర్చించబోతున్నాం. మనందరికి తెలుసు ఇండియా చిన్న దేశం కాదు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం. చాలా శక్తివంతమైనది. చాలా పాపులరైంది' అని అన్నారు. ఇజ్రాయెల్-గాజా యుద్ధంలో రెండు దేశాల సిద్ధాంతం ప్రతిపాదిస్తూనే టెల్ అవీవ్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తుందని తెలిపారు. అయితే దీనిపై ప్రధాని మోదీ స్పందించారు.. 'నా మిత్రుడు ప్రధాని నెతన్యాహుతో ఇదివరకే ఫోన్‌లో సంభాషించాను. ఇజ్రాయెల్-ఇండియా వ్యూహాత్మక సంబంధాలపై చర్చించాం. రెండుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం దిశగా చర్చలు జరుపుతున్నాము. అదేవిధంగా టెర్రరిజాన్ని మాత్రం ఎట్టిపరిస్థితిలో సహించేది లేదు. ఆ ప్రాంతంలో శాంతి, సుస్థిరత సాధించేందుకు భారత్ తన పూర్తి సహకారాన్ని అందిస్తుంది' అని తెలిపారు.

# ఉండాల్నా.. పోవాల్నా?

మొదటి పేజీ తరువాయి

ఎంఐఎం సభ్యుల మద్దతు ఉంది. ఎమ్మెల్యే ప్రతిపాదించిన అభ్యర్థులకు వ్యతిరేకంగా పోటీ చేసి 9 మంది స్వతంత్రులుగా గెలిచారు. పార్టీ కోసం పనిచేసిన వారికి పదవి ఇవ్వాలని, అవకాశవాదులకు అవకాశం ఇవ్వవద్దని, ఏవిధమైన బేరసారాలకు పాల్పడకూడదని పేర్కొన్నా. పార్టీకి కట్టుబడి ఉన్నామని స్పష్టంగా పేర్కొన్నా.. ఎమ్మెల్యే నలుగురు కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. ప్రభుత్వం మారినా.. గెలిచినా, ఓడినా పార్టీ కోసం పని చేసిన వారికి పదవి ఇవ్వాలని కోరిన. చైర్ పర్సన్ పదవి కోసం మాత్రమే ప్రతిపాదన చేసిన. వైస్ చైర్ పర్సన్ నియామకం గురించి చర్చించలేదు. జనవరి 25న ఎమ్మెల్యే సంజయ్‌ను సమాండ్ల శ్రీనివాస్ కలిశారు. బీ ఫామ్ ఇచ్చారు. పార్టీని నమ్ముకున్న వారికి కాకుండా వలస వాదులకు చైర్ పర్సన్ పదవి ఇవ్వడాన్ని ఏవిధంగా జీర్ణించుకోవాలి? బీ ఫామ్ ఇవ్వడమే సరికాదు అంటే చైర్పర్సన్ పదవి కట్టబెట్టడంకార్యకర్తలను తీవ్ర మనోవేదనకు గురి చేస్తోంది. ఎమ్మెల్యే సారథ్యంలో కొనసాగితేనే పార్టీలో ఉండండి అనేలా అధిష్ఠానం చర్యలు ఉన్నాయి. జగిత్యాలలో సంజయ్‌కు పవర్ ఆఫ్ అటార్నీ రాసిచ్చారా? కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల హక్కుల కాపాడకుండా, మనో వేదన అనుభవిస్తూ ఎంతకాలం కొనసాగుతా? వలసవాదులను మా నెత్తిమీద రుద్దడం ఏమిటి? మా ఆత్మ గౌరవం ఏమి కావాలి? జగిత్యాలలో కాంగ్రెస్ జెండా ఎగురవేశామని సంబురపడాలా? లేక బాధపడాలా? ఎమ్మెల్యే సంజయ్.. మమ్మల్ని ఎందుకు గోస పోసుకుంటున్నావ్? బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఎందుకు జోక్యం చేసుకుంటున్నావు? ఈ అవమానాలు ఎంతకాలం భరించాలి? 15 వార్డులో స్వతంత్ర అభ్యర్థిని నిలబెట్టి, యూత్ కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించారు. నీ పుణ్యమా అని బీ ఫామ్ తీసుకున్న వారికి చేయలేకపోయా. నేను ప్రచారం చేస్తే ఇంకా కొన్ని సీట్లు వచ్చేవి. ప్రచారం చేయలేకపోవడంతో మానసికంగా క్షోభ అనుభవించిన. ఈ వేధింపులు ఇప్పటితో ముగిసేవి కావు. ఎమ్మెల్యే ఉన్నంత కాలం ఉంటాయి. ఇంత ఆత్మ క్షోభ అనుభవిస్తూ కొనసాగటం ఎలా? అని ఊహించుకోలేకపోతున్న. నేను వ్యక్తిగతంగా ఏమి కోరుకోవడం లేదు. వైస్ చైర్ పర్సన్‌కు చైర్ పర్సన్ పదవి ఇస్తే సంతోషించేవాడిని. జీవన్ రెడ్డిని ఒంటరిని చేయడమే ఎమ్మెల్యే లక్ష్యంగా కనిపిస్తోంది. టికెట్ రాని కోసం కొట్లాడి గెలిపించిన. అభ్యర్థులను బెదిరించి, తీసుకెళ్లినా, వారి మనసు జీవన్ రెడ్డి తో ఉంటది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో జగిత్యాల పట్టణానికి 25 కోట్లు కేటాయించి, ఫిల్టర్ బెడ్ నిర్మించి, నిరంతరం నీరు సరఫరా చేసిన. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కాళ్లలో కట్టె అడ్డం పెట్టి మా హక్కులు కొల్లగొడుతున్నావ్. జగిత్యాల అభివృద్ధిని అడ్డుకుంటున్నావ్' అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# రాహుల్ నాకు నచ్చడు

మొదటి పేజీ తరువాయి

అని తెలిపారు. నాలుగుసార్లు తిరువనంతపురం ఎంపీగా గెలిచి, ఆపరేషన్ సింధూర్ వంటి అంశాలపై పార్టీ అధిష్టానంతో విభేదిస్తున్న శశిథరూర్‌పైనా అయ్యర్ విమర్శలు గుప్పించారు. థరూర్ పాకిస్థాన్ వ్యతిరేకి అని, ఆయనకు తదుపరి విదేశాంగ మంత్రి కావాలనే బలమైన ఆంక్షలున్నాయని అన్నారు. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ అధిపతి జైరాం రమేశ్ సైతం తన ఉద్యోగాన్ని నిలుపుకోవాలని అనుకుంటారని చెప్పారు. మణిశంకర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. పార్టీతో చాలా ఏళ్లుగా ఆయనకు సంబంధాలు లేవని, ఆయన ఏమి మాట్లాడినా, రాసినా అవి ఆయన వ్యక్తిగత అభిప్రాయాలేనని పవన్ ఖేరా పేర్కొన్నారు. యూడీఎఫ్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని కేరళ ప్రజలు కోరుకుంటున్నారని, ఎల్‌డీఎఫ్-బీజేపీ రహస్య భాగస్వాములనే విషయం ప్రజలకు బాగా తెలుసునని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# జేఈఈ మెయిన్‌లో తెలుగోళ్ల సత్తా

మొదటి పేజీ తరువాయి

సాధించారు. వీరిలో ఇద్దరు ఏపీకి చెందిన విద్యార్థులు ఉండగా, ఒక తెలంగాణ విద్యార్థి ఉన్నారు. శరత్ మహేశ్వరి, నరేంద్ర, మోహిత్ 100 పర్సెంటైల్ సాధించారు. ఓపెన్ కేటగిరిలో పసల మోహిత్ అనే విద్యార్థి 100 పర్సెంటైల్ సాధించగా, ఓబీసీ కేటగిరిలో టాపర్‌గా నరేంద్ర బాబు నిలిచారు. జేఈఈ మెయిన్ పరీక్షను 13.04 లక్షల మంది విద్యార్థులు రాశారు. దేశవ్యాప్తంగా జాతీయ విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్ పరీక్షలకు రికార్డు స్థాయిలో దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. గత మూడేళ్లతో పోలిస్తే ఈసారి జనవరి మెయిన్ పరీక్షలకు దరఖాస్తులు భారీగా పెరిగాయి. 2025 తొలి సెషన్‌కు 13.80 లక్షలు దరఖాస్తులు వచ్చాయి. ఇది 2024 కంటే అధికం. అదేవిధంగా 95 నుంచి 96 శాతం మంది పరీక్షలకు హాజరు కాగా, రెండు సెషన్లలోనూ భారీగా పోటీ పెరిగింది.

# బిల్ గేట్స్.. క్విట్ ఇండియా

మొదటి పేజీ తరువాయి

ప్రజలకు గానీ ఆయన విలువనివ్వలేదు. ఏటువంటి ప్రయోగాలకైనా వీరిని వాడుకోవచ్చనే ఉద్దేశంలో ఆయన మాట్లాడారు. దీంతో ఈ అంశం నెట్టింట్లో తీవ్రంగా ట్రోల యింది. బిల్‌గేట్స్ క్విట్ ఇండియా అంటూ హ్యాష్‌ట్యాగ్ ట్రెండయ్యింది. వెలగపూడి సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రాన్ని బిల్ గేట్స్ సందర్శించారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ వినియోగంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు..దాని ద్వారా సాధిస్తున్న ఫలితాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్, ఆయన బృందానికి వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్ గేట్స్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్టీజీఎస్‌లోని డిస్ ప్లే వాల్స్‌పై ప్రజంటేషన్లను బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని సీఎం చంద్రబాబు నాయుడు వివరించగా... డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని బిల్ గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమారాచాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరును కూడా బిల్ గేట్స్ పరిశీలించారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ పరిశీలించగా... బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని... అలాగే, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌కు వివరించారు.

## 5 శాతానికి నిరుద్యోగం

న్యూఢిల్లీ: పనిచేసే అవకాశం ఉన్న 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వ్యక్తుల్లో నిరుద్యోగ రేటు పెరిగింది. కేంద్రం సోమవారం విడుదల చేసిన జనవరి నెల డేటా ప్రకారం.. నిరుద్యోగ రేటు 4.8 శాతం నుంచి 5 శాతానికి పెరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రెండు చోట్లా నిరుద్యోగం పెరగడమే ఇందుకు కారణం. గ్రామీణ నిరుద్యోగ రేటు 4.2 శాతంగా ఉంది. అంతకుముందు డిసెంబర్‌లో ఇది 3.9 శాతం ఉంది. పట్టణ నిరుద్యోగ రేటు 6.7 శాతం నుంచి 7.0 శాతానికి పెరిగింది. ఉపాధి రంగంలో మహిళల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 39.7 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25.5 శాతంగా ఉంది. శీతాకాలంలో గ్రామీణ ఉపాధి అవకాశాలు తగ్గడం వల్లనే మొత్తం నిరుద్యోగం పెరగడానికి కారణమని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## భారత పాస్‌పోర్టుకు 75వ ర్యాంక్

### హెన్లీ ఇండెక్స్ 2026 నివేదిక విడుదల

న్యూఢిల్లీ: అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ 75వ స్థానంలో నిలిచింది. ప్రముఖ 'హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026' నివేదిక ప్రకారం..భారత పాస్‌పోర్ట్ ర్యాంక్ గణనీయంగా మెరుగుపడింది. గతేడాదితో పోలిస్తే 10 స్థానాలు ఎగబాకిన భారత పాస్‌పోర్ట్ 75వ ర్యాంకును సాధించింది. 2025లో భారత పాస్‌పోర్ట్ 85వ అత్యంత శక్తివంతమైనదిగా నిలిచింది. ర్యాంకు మెరుగుపడటంతో అంతర్జాతీయంగా భారతీయ పౌరుల ప్రయాణం గణనీయంగా మెరుగుపడింది. ప్రస్తుతం భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు మొత్తం 56 దేశాలకు వీసా లేకుండా లేదా అరైవల్ వీసా, ఈ-వీసా సౌకర్యంతో ప్రయాణాలు చేయవచ్చు.

## పెళ్లికి ముందే సెక్స్ ఏంటో?

మొదటి పేజీ తరువాయి

ఉండటం ఎలా సాధ్యమనేది మాకు ఇప్పటికీ అర్థం కావడం లేదు' అని అన్నారు. 'ఈ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి, పెళ్లికి ముందు ఎవరు ఎవర్నీ నమ్మకూడదు' అని వ్యాఖ్యానించారు. మ్యాటిమోనియల్ సేవలు అందించే ఓ వైబ్‌సైట్ ద్వారా బాధిత మహిళ, నిందితుడు మధ్య 2022లో పరిచయం ఏర్పడింది. ఆ వ్యక్తి ఆమెను వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి, శారీరక సంబంధాన్ని ఏర్పరచుకున్నాడని, దుబాయ్‌లో పలుసార్లు కలుసుకున్నారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఇరువురూ ఏకాంతగా ఉన్నప్పుడు ఆమె అనుమతి లేకుండానే వీడియోలు తీసి, వాటిని బయటపెడతానని బెదిరించాడని ఆరోపణలు చేసింది. కొద్ది రోజుల్లో అతడి నిజస్వరూపం బయటపడిందని, అప్పటికే పెళ్లైనట్టు, 2024లో పంజాబ్‌లో మరో మహిళను రెండో పెళ్లి చేసుకున్నట్టు బాధితురాలు గుర్తించింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న జోక్యం చేసుకుంటూ... పెళ్లికి ముందు అతడితో దుబాయ్ ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ప్రాసిక్యూషన్ దీనికి స్పందిస్తూ.. మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా కలిశారాని, పెళ్లి చేసుకోవాలని భావించారని అన్నారు. ఆమె ప్రాధాన్యం వివాహమే అయితే అతడితో కలిసి దుబాయ్ వెళ్లి ఉండకూదని జస్టిస్ నాగరత్న అన్నారు. 'ఆమె అంత కఠినంగా ఉంటే పెళ్లికి ముందే వెళ్లి ఉండకూడదు. మేము వారిని మధ్యవర్తిత్వానికి పంపుతాం. పరస్పర అంగీకారంతో శారీరక సంబంధంలో ఉంటే విచారించే కేసులుగా పరిగణించలేం' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. అనంతరం విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## వరి బోనస్ బకాయిలు విడుదల

మొదటి పేజీ తరువాయి

సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ బోనస్ ద్వారా 2025-26లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రెండు లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధరకు ఈ రూ.500 అదనం. బకాయిల చెల్లింపుతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు 84 మున్సిపాలిటీలు

మొదటి పేజీ తరువాయి

కొనసాగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో సంచలనం రేపిన జనగామ మున్సిపాలిటీలో చిత్రమైన పరిస్థితి నెలకొంది. జనగామలోని 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ 12 వార్డుల్లో విజయం సాధించగా, దాని మిత్రపక్షం సీపీఎం ఒక వార్డును దక్కించుకుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కూడా 13 సీట్లలో గెలిచింది. మరో నలుగురు ఇండిపెండెంట్లు కూడా గెలిచారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ నేత, జనగామ సిట్టింగ్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో మళ్లీ ఇరుపార్టీలకు సమానంగా చెరో 14 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు దృష్టి మొత్తం ఇండిపెండెంట్ కౌన్సిలర్లపై పడింది. నలుగురు స్వతంత్ర అభ్యర్థుల్లో కాంగ్రెస్‌కు ఇద్దరు, బీఆర్ఎస్‌కు ఇద్దరు మద్దతు తెలుపుతున్నట్లు ప్రచారం జరగడంతో ఆ మున్సిపల్ రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తిరుమలగిరి మినహా అన్ని పురపీఠాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 పురపాలికలను, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 10, ఆదిలాబాద్ జిల్లాలో 5 దక్కించుకోగా.. 2చోట్ల కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 7 మున్సిపాలిటీలను, మెదక్ జిల్లాలో 9 పురపాలికలను, వరంగల్ జిల్లాలో 9 మున్సిపాలిటీలు, రంగారెడ్డి జిల్లాలో 10 పురపీఠాల్ని చేజిక్కించుకుంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 7 పురపాలికలను కైవసం చేసుకుంది.

### బీజేపీదే కరీంనగర్ కార్పొరేషన్

ఏడు కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నిక ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాలను గెలుచుకోగా, బీజేపీ కరీంనగర్ మేయర్ పదవిని కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు సమానంగా సీట్లు రావడంతో రెండు పార్టీలు అవగాహన కుదుర్చుకున్నాయి. మొదటి రెండున్నరేళ్లు మేయర్ పదవి సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఇవ్వాలని నిర్ణయించాయి. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ పార్టీ సహకారంతో నిజామాబాద్ మేయర్ పదవిని దక్కించుకుంది. మొదటి నుంచి ఉత్కంఠ రేపిన కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి దక్కింది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలు 22 స్థానాల చొప్పున గెలిచాయి. ఇక్కడ బీఆర్ఎస్ 8 సీట్లు గెలుచుకుంది. సీపీఐకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బేషరతుగా మద్దతు ప్రకటించినప్పటికీ, సీపీఐ మాత్రం రొటేషన్ పద్ధతిలో మిత్రపక్షం కాంగ్రెస్ పార్టీతో నడిచేందుకు మొగ్గు చూపింది.

## ఎన్నిక వాయిదా పడ్డ మున్సిపాలిటీలు (11)

ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్

**కార్పొరేషన్లు (7):**

కాంగ్రెస్ (5): రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నల్లగొండ

బీజేపీ (1): కరీంనగర్

సీపీఐ (1): కొత్తగూడెం

**మేయర్, డిప్యూటీ మేయర్లు:**

1. కరీంనగర్ కార్పొరేషన్ – మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ), డిప్యూటీ మేయర్: సునీల్ రావు (బీజేపీ).
2. నిజామాబాద్ కార్పొరేషన్ – మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మా తహసీన్ (మజ్లిస్)
3. రామగుండం కార్పొరేషన్ – మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపెల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)
4. కొత్తగూడెం కార్పొరేషన్ – మేయర్: మూడ్ గణేశ్ (సీపీఐ), డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారి (కాంగ్రెస్)
5. నల్గొండ కార్పొరేషన్ – మేయర్: బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్
6. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ – మేయర్: గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సురేందర్ రెడ్డి (కాంగ్రెస్),
7. మంచిర్యాల కార్పొరేషన్ – మేయర్: మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: రమ్య మహేశ్ (కాంగ్రెస్).





## బీఆర్ఎస్ 17 మున్సిపాలిటీలు ఇవే..

**ఉమ్మడి మెదక్ - ( 7 )**

1. గడ్డపోతారాం
2. గుమ్మడిదల
3. ఇస్నాపూర్ (బీజేపీ సపోర్ట్)
4. జిన్నారం
5. గజ్వేల్
6. తూప్రాన్
7. దుబ్బాక

**ఉమ్మడి మహబూబ్ నగర్ - ( 2 )**

8. ఆలంపూర్
9. అయిజ

**ఉమ్మడి రంగారెడ్డి ( 2 )**

10. మూడు చింతలపల్లి
11. ఎల్లంపేట (బీజేపీ సపోర్ట్)

**ఉమ్మడి కరీంనగర్ ( 3)**

12. రాయికల్ (కాంగ్రెస్ సపోర్ట్)
13. సిరిసిల్ల
14. జమ్మికుంట

**ఉమ్మడి వరంగల్ - (1)**

15. చేర్యాల

**ఉమ్మడి నల్గొండ- (1)**

16. తిరుమలగిరి

**ఉమ్మడి ఆదిలాబాద్ - (1)**

17. ఆసిఫాబాద్



# ఆ 5 గ్రామాలు మాకిచ్చేయండి

**ఏపీ సీఎం చంద్రబాబుతో తుమ్మల**

**సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై కీలక చర్చలు**

ఉండవల్లి, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉండవల్లిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో పరిష్కరించుకోవాల్సిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని తుమ్మల చంద్రబాబుకు ప్రధానంగా విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సమీపంలో ఉన్న యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలను తెలంగాణకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఈ గ్రామాలు భౌగోళికంగా తెలంగాణ భూభాగంలో ఉన్నప్పటికీ, పరిపాలనపరంగా ఏపీలో ఉండటంతో అక్కడి గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల వివరించారు. జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణించాల్సి రావడం, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల సమస్యలు, పరిపాలనాపరమైన ఇబ్బందులను ఆయన చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. భద్రాచలం రామాలయానికి చెందిన కొన్ని భూములు ఏపీ పరిధిలో ఉండటం వల్ల తలెత్తుతున్న సమస్యలను కూడా ప్రస్తావించారు. ఈ సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలను కూడా తుమ్మల సీఎం చంద్రబాబు ముందుంచారు. తిరుమలలో తెలంగాణ భక్తుల సౌకర్యార్థం యాత్రికుల భవనం నిర్మించడానికి 5 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. అలాగే, ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల అంశాన్ని కూడా చర్చించారు. ఈ ప్రాజెక్టు కింద 85 శాతం ఆయకట్టు ఏపీలోనే ఉన్నందున, మరమ్మతుల కోసం అయ్యే రూ.92.20 కోట్ల ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేందుకు అంగీకరించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తుమ్మల ఆయనతో భేటీ కావడం ఇదే తొలిసారి. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నందున, ఆయన చొరవ తీసుకుంటే దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఈ పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్

**మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): తెలంగాణలో అధికారం కోసం జెండాలు అజెండాలను పక్కనపెట్టి అధికార పీఠం కోసం ఎంతలా దిగజార్చవచ్చో కాంగ్రెస్, బీజేపీలు నేడు నిరూపించాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు అన్నారు. మార్పు అంటే బీజేపీతో జతకట్టడమేనా..? ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని ప్రశ్నించారు. గత 12 ఏండ్లుగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీకి బీ–టీమ్ అని కాంగ్రెస్, కాంగ్రెస్‌కు బీ టీమ్ అని బీజేపీ చెప్పినవన్నీ పచ్చి అబద్దాలు అని, ఆ రెండు పార్టీలు తెలంగాణ వ్యతిరేక టీమ్ అని నిరూపించాయని పేర్కొన్నారు. బీజేపీతో కలిసి సింగిల్ టీమ్ గా మారిపోయింది. ఈ అపవిత్ర కలయిక, ఈ అనైతిక పొత్తు ప్రజలు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీల మధ్య ఉన్న ఫెవికాల్ బంధం ఈరోజు మున్సిపల్ ఫలితాలతో మరోసారి స్పష్టమైంది. కేవలం బీఆర్ఎస్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ రెండు పార్టీలు సిద్ధాంతాలను గాలికొదిలేశాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ఒకటేనని ఈ మున్సిపల్ ఫలితాలు మరోసారి రుజువు చేశాయి. ఢిల్లీలో కొట్టుకున్నట్టు.. గల్లీలో మాత్రం చేతులు కలుపుతూ వాటాలు వేసుకొని పదవులు పంచుకుంటున్నారు. దీనికి అలియాబాద్, అమన్ గల్,మెదక్, నర్సాపూర్ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. రేవంత్ రెడ్డి .. మీరు నడిపేది కాంగ్రెస్ సర్కారా..? బీజేపీ సర్కారా.. ? బీజేపీ, టీడీపీతో కూడిన సంకీర్ణ సర్కారా..? అలియాబాద్ నుంచి అమనగల్ దాకా.. మెట్‌పల్లి నుంచి మెదక్ దాకా మీరు సాగిస్తున్న ఈ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారని హరీష్ రావు అన్నారు..కాంగ్రెస్ పార్టీకి ఒంటరిగా బీఆర్ఎస్‌ను ఎదుర్కొనే సత్తా లేదు. అందుకే సిగ్గు వదిలేసి బీజేపీతో



కుమ్మక్కైంది. రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్ ను నిలువరించి అధికారాన్ని చేపట్టడానికి ఏదో ఒక విధంగా ఫలితాలను తారుమారు చేస్తూ మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ ఏమో దేశమంతా బీజేపీ మీద పోరాటం చేస్తే.. ఇక్కడ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఏమో బీజేపీతో జత కడుతున్నది.రాహుల్ గాంధీ .. మీరు ఢిల్లీలో రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారు. దానికి ఈ పొత్తులే సాక్ష్యమని హరీష్ రావు స్పష్టం చేశారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డిని, బండి సంజయ్‌ను సూటిగా ప్రశ్నిస్తున్నాను.. మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నికకు బీజేపీ పార్టీ కాంగ్రెస్‌తో కలిసింది మీకు తెలియదా..? తెలిసే చేశారా..? ఢిల్లీలో పెద్దలు కాంగ్రెస్ ముక్త్ భారత్ అంటారు.. ఇక్కడ మీరేమో కాంగ్రెస్ యుక్త్ బీజేపీ అని నిరూపిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఉన్న బలాన్ని చూసి భయపడే మీరు ఈ కుట్రలకు తెరలేపారని హరీష్ రావు మండిపడ్డారు. సింగిల్‌గా మా పార్టీని ఎదుర్కొనే దమ్ములేక.. రెండు జాతీయ పార్టీలు ఒక్కటై, బీఆర్ఎస్ మీద దాడి చేస్తున్నాయి. ఇది మా విజయానికి నిదర్శనం కాక మరి ఏమిటి...? బీఆర్ఎస్ అత్యధిక వార్డులు గెలుచుకున్న చోట్ల కూడా కుట్రలు చేసి పదవులు దక్కించుకున్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కాంగ్రెస్ తీసుకుని, వైస్ చైర్మన్ పదవి బీజేపీకి ఇచ్చారంటే ఇంతకంటే దిగజారుడు రాజకీయం మరొకటి ఉంటుందా..? ఒక పక్క నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎంఐఎంతో పొత్తు పెట్టుకుంటారు. మరోపక్క ఉత్తర తెలంగాణలో బీజేపీతో జతకడతారు. ఇదేనా ప్రజా పాలన' అని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్తారన్నారు.

# ట్రిపుల్ ఐటీ జంక్షన్‌లో 3 ఫ్లైఓవర్లు

## 800 కోట్ల అంచనాతో జీహెచ్ఎంసీ పనులు

గచ్చిబౌలి/హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): ఐటీ కారిడార్‌లో వాహనదారులకు నిత్యం నరకం చూపిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ జంక్షన్‌ను సిగ్నల్ ఫ్రీ కారిడార్‌గా మార్చేందుకు బహుళస్థాయి ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు ఫ్లైఓవర్లు, ఒక అండర్‌పాస్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పిల్లర్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ట్రిపుల్ ఐటీ, ఖాజాగూడ, విప్రో జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీని శాశ్వతంగా తగ్గించేందుకు జీహెచ్ఎంసీ సుమారు రూ. 800 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇందులో భాగంగా ట్రిపుల్ ఐటీ జంక్షన్ వద్ద ఐఎస్‌బీ నుంచి డీఎల్ఎఫ్ వరకు నాలుగు లేన్ల ఫ్లైఓవర్, ముంబై హైవే నుంచి డీఎల్ఎఫ్ వైపు రెండు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్, ఇందిరా నగర్ నుంచి హెచ్‌సీయూ వరకు ఒక అండర్‌పాస్‌ను నిర్మించనున్నారు. ఐటీ కారిడార్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లతో ఉద్యోగులు గంటల తరబడి రోడ్లపైనే వేచి ఉండాల్సి వస్తోంది. గత వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రమైంది. "ఈ నిర్మాణం పూర్తయితే ప్రయాణికులు ఒక్క సిగ్నల్ వద్ద కూడా ఆగకుండా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ఇది ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా, ఇంధనాన్ని కూడా గణనీయంగా ఆదా చేస్తుంది" అని జీహెచ్ఎంసీ అధికారి ఒకరు తెలిపారు. 2028 మే నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే కోకాపేట నియోపొలిస్‌కు కూడా రవాణా సులభతరం అవుతుంది. పాత ముంబై హైవేపై ప్రయాణం కూడా సాఫీగా మారనుండటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## వృద్ధురాలి ఫిట్‌నెస్‌కు సజ్జనార్ ఫిదా

**రామసుబ్బమ్మపై సజ్జనార్ ప్రశంసలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): 78 ఏళ్ల వయసులోనూ పరుగుల పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్న ఓ వృద్ధురాలిపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసల వర్షం కురిపించారు. పట్టుదలకు వయసు అడ్డంకి కాదని నిరూపిస్తున్న ఆమె, నేటి యువతకు గొప్ప స్ఫూర్తి అని ఆయన కొనియాడారు. 'రాకింగ్ రామసుబ్బమ్మ' అంటూ ఓ పత్రికలో వచ్చిన కథనం క్లిప్పింగ్ ను కూడా సజ్జనార్ సోషల్ మీడియాలో పంచుకున్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన 78 ఏళ్ల రామసుబ్బమ్మ, గతంలో పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేశారు. ప్రస్తుతం ఇళ్లలో పనులు చేసుకుంటూనే అథ్లెటిక్స్‌లో రాణిస్తున్నారు. ట్రాక్‌పై చిరుతలా పరుగెడుతూ ఇప్పటివరకు 12 బంగారు పతకాలను గెలుచుకున్నారు. త్వరలో అంతర్జాతీయ వేదికపై దేశం తరఫున పోటీ పడేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రామసుబ్బమ్మ సంకల్ప బలాన్ని ప్రస్తావిస్తూ సజ్జనార్ ఓ సందేశాన్ని విడుదల చేశారు. "వార్ధక్యం శరీరానికే కానీ, సంకల్పానికి కాదు" అని రామసుబ్బమ్మను చూస్తే అనిపిస్తుందని అన్నారు. 78 ఏళ్ల వయసులో ఆమె పతకాల వేటలో ఉంటే, కొందరు యువత చిన్న వయసులోనే బద్ధకానికి బానిసలై, స్మార్ట్‌ఫోన్ల మాయలో పడి భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, మద్యం వంటి వ్యసనాల్లో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు హితవు పలికారు. రామసుబ్బమ్మ అడుగుజాడల్లో నడిచి, శ్రమను నమ్ముకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన పిలుపునిచ్చారు. "సలాం రామసుబ్బమ్మ గారు, మీ పట్టుదలే అందరికీ స్ఫూర్తిదాయకం" అంటూ ఆయన తన సందేశాన్ని ముగించారు.

# టర్మ్ అయిపోయేలోగా పీఠం ఎక్కుతాం

**కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం అనైతిక పొత్తు**

**నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వెల్లడి**

నిజామాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): నిజామాబాద్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి బీజేపీని ఓడించి కార్పొరేషన్ ను కైవసం చేసుకున్నాయని మండిపడ్డారు. స్వల్ప మెజార్టీతో తాము మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కోల్పోయామని చెప్పారు. ఈ మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ పూర్తి కాకముందే మేయర్ పీఠాన్ని బీజేపీ ఎక్కుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఇది నా మాటగా చెబుతున్నాను. మేయర్, డిప్యూటీ మేయర్ టర్మ్ ముగిసేలోపు సీన్ రివర్స్ చేసి చూపిస్తాం" అని అర్వింద్ అన్నారు. ఇక్కడికి అక్బరుద్దీన్ ఒవైసీ వచ్చి హిందువులను దూషించినా... ఆత్మాభిమానాన్ని చంపుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎంతో కలిసిపోయాయని తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం, కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో కల్వకుంట్ల కుటుంబాన్ని రేవంత్ రెడ్డి ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఈ పొత్తుల వెనుక ఆ రహస్యాలు దాగున్నాయని ఆరోపించారు. పోలీసులు కూడా రాజకీయ రంగుపులుముకుని బీఆర్ఎస్ కార్పొరేటర్‌ను ఎత్తుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేలా చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. కరీంనగర్‌లో మేయర్ ఓటింగ్‌కు దూరంగా ఉన్న బీఆర్ఎస్... నిజామాబాద్‌లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "కరీంనగర్ మీదనే ఎందుకు ప్రేమ? నిజామాబాద్ మీద ఎందుకు లేదు?" అని ప్రశ్నించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డిలకు నార్కో పరీక్షలు చేస్తే నిజం బయటపడుతుందని అన్నారు.



## కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్

కరీంనగర్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): పుర ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఎంతో ఉత్కంఠగా మారిన కరీంనగర్ కార్పొరేషన్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంది. కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ తొలిసారి దక్కించుకుంది. కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ పార్టీ తటస్థంగా వ్యవహరించింది. దీంతో బీజేపీ అభ్యర్థి గెలుపు సునాయాసమైంది. బీజేపీకి 34 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన మేయర్ అభ్యర్థి నర్మదకు 21 ఓట్లు వచ్చాయి. తొమ్మిది స్థానాలు ఉన్న బీఆర్ఎస్ ఎన్నికను బహిష్కరించింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో 66 స్థానాలు ఉండగా, బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, మజ్లిస్ 3 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఇతరులు 10 చోట్ల గెలుపొందారు. బీఆర్ఎస్, మజ్లిస్, స్వతంత్రులతో కలిపి కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో తమకు అధికారానికి కావాల్సిన స్థానాలు దక్కలేదు కాబట్టి తాము మేయర్ ఎన్నికను బహిష్కరించామని బీఆర్ఎస్ కౌన్సిలర్లు వెల్లడించారు. తాము బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటించామని అన్నారు. తమకు మెజారిటీ స్థానాలు వస్తే తాము మేయర్ పదవి కోసం బరిలో నిలిచేవాళ్లమని వెల్లడించారు.



## జాగృతిలో చేరిన మాజీ ఎమ్మెల్యే కుమారుడు, కోడలు

బంజారాహిల్స్/హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత కావేటి సమ్మయ్య కుమారుడు కావేటి మనోహర్ కుమార్ తెలంగాణ జాగృతిలో చేరారు. తన అనుచరులతో కలిసి హైదరాబాద్‌లోని కవిత నివాసంలో మనోహర్ కుమార్ దంపతులు తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి శాలువా కప్పి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, కావేటి సమ్మయ్య కుటుంబం తెలంగాణ పట్ల ఎంతో నిబద్ధత కలిగిన కుటుంబమని అన్నారు. కావేటి మనోహర్, సబిత దంపతుల రాకతో తెలంగాణ జాగృతికి కొమురంభీమ్ జిల్లాలో మరింత బలం చేకూరిందని అన్నారు. జాగృతి సంస్థ చేపట్టే సాంస్కృతిక, సామాజిక సేవా కార్యక్రమాలలో వీరు క్రియాశీలక పాత్ర పోషిస్తారని కవిత తెలిపారు. కావేటి సమ్మయ్య 2007లో బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) పార్టీలో చేరారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో, 2011 ఉప ఎన్నికల్లో సమ్మయ్య బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 2018లో బీఆర్ఎస్ తనకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత కొన్నాళ్లకు బీఆర్ఎస్‌లోకి తిరిగి వచ్చారు. 2020లో కావేటి సమ్మయ్య మృతి చెందారు.

## దేశం గర్వించేలా నల్లగొండ

**అదే నా లక్ష్యం: మంత్రి కోమటిరెడ్డి**

నల్లగొండ, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ లను ఈరోజు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తన జీవిత కల అని భావోద్వేగంతో చెప్పుకొచ్చారు. నూతన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు ఆయన అభినందనలు తెలిపారు. నల్లగొండ తన జన్మభూమి అని కోమటిరెడ్డి అన్నారు. నల్లగొండలోని ప్రతి గల్లీ తన గుండెచప్పుడు అని చెప్పారు. ఈరోజు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రమాణస్వీకారం చేస్తుంటే... తన మనసు ఎంతో గర్వంతో నిండిపోయిందని అన్నారు. నల్లగొండను దేశం గర్వించేలా క్లీన్ అండ్ గ్రీన్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. "రాజకీయాలకు తావు లేకుండా, మేము ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తాం. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరేలా చూడడమే నా బాధ్యత" అని మంత్రి ప్రకటించారు.

## కొండగట్టు అంజన్న సేవలో


# యాక్షన్ కింగ్ అర్జున్



మల్యాల, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని ప్రముఖ సినీ నటుడు, యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అర్జున్ కుటుంబానికి కొండగట్టు ఆలయ ఈవో, వేద పండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అర్జున్ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం పలికారు. దర్శనం అనంతరం అర్జున్ మాట్లాడుతూ కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని, స్వామివారి కృప అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాలను చూసి ప్రశాంతత లభించిందని పేర్కొన్నారు.

## 19న కొండగట్టు అంజన్న హుండీ లెక్కింపు

మల్యాల, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో భక్తులు సమర్పించుకున్న కానుకల హుండీ లెక్కింపు వచ్చే ఈ నెల 19న గురువారం చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణంలో హుండీల లెక్కింపు ఉంటుందని ఆలయ ఈవో పేర్కొన్నారు.



## అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

మల్యాల, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): పట్టభద్ర ఎమ్మెల్సీ అంజి రెడ్డి కుటుంబ సమేతంగా కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో వారికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట గాజుల మల్లేశం, గడ్డం నడిపి మల్లేశం, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, పన్నటి మల్లేశం, గడ్డం నాగరాజ్, నక్కా ఆనందం, గంగమల్లు, మంద కొమురయ్య బీజేపీ కార్యకర్తలు ఉన్నారు.



## వైభవంగా లింగోద్భవ పూజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం అర్ధరాత్రి ఆలయాల్లో లింగోద్భవ పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. లింగోద్భవ మూర్తికి అర్ధరాత్రి ఏకాదశ అభిషేకాలు నిర్వహించారు. కాచిగూడ నెహ్రూనగర్ లోని శ్రీ ఉమా మహేశ్వర దేవాలయంలో భక్తులు లింగోద్భవ వేళ దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. సర్వేశ్వరుడు మహా లింగాకృతునిగా ఆవిర్భవించిన సమయాన్ని లింగోద్భవంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. కాచిగూడలోని శివాలయాల్లో ఏక రుద్రాభిషేకం, కళ్యాణోత్సవంతో పాటు లింగోద్భవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివపార్వతులను దర్శించుకున్నారు. తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నేత, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## గుడిపేటలో రేషన్ సబ్ సెంటర్ ప్రారంభం

మల్యాల, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం గుడిపేటలో రేషన్ దుకాణం సబ్ సెంటర్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వర శ్రీనివాస్ గౌడ్, సర్పంచు ఇట్టిరెడ్డి శ్వేతా అంజిరెడ్డి ప్రారంభించారు. గుడిపేట గ్రామంలో రేషన్ దుకాణం లేకపోవడంతో గ్రామస్తులు రేషన్ కోసం మల్యాలకు వచ్చే పరిస్థితి ఉండేది. ఈ సమస్యను సర్పంచి, మార్కెట్ కమిటీ చైర్మన్.. ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జగిత్యాల ఆర్డీవోతో మాట్లాడిన సబ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో సోమవారం నుంచి రేషన్ సబ్ సెంటర్ అందుబాటులోకి వచ్చింది. గుడిపేట ప్రజల కోరికను నెరవేర్చిన ఎమ్మెల్యే సత్యంకు సర్పంచ్ ఇట్టిరెడ్డి శ్వేత అంజిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# అన్నదానం..పుణ్యకార్యం

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీరామచంద్రనాయక్

మహబూబాబాద్,ఫిబ్రవరి16 (ఈవార్తలు): అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అలాంటిది పది మందికి పంచి పెట్టడమే మహాదానమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే శ్రీరామచంద్ర నాయక్ అన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని ఆయన పేర్కొన్నారు. కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పండుగ సందర్భంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా కురవిలో శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అన్ని దానాల్లోకెల్లా అన్నదానం ఎంతో పుణ్యమైందని అన్నారు. ఓ సంస్థను స్థాపించి... గత 10 సంవత్సరాలుగా విజయవంతంగా అన్నదానం నిర్వహించడం ఆషామాషీ కాదన్నారు., ఎంతో సేవా తత్పరరత ఉన్నవారికే అది సాధ్యం అవుతుందన్నారు. కురవి శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు చరిత్రలో ఓ మైలురాయి అని అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత దానధర్మాలకు కేటాయించాలని సూచించారు. అన్నింటికంటే దైవ కార్యంలో నిమగ్నులవ్వడం కొందరికే వీలవుతుందని, ఆ కొందరిలో శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రతినిధులు అందిస్తున్న సేవ ఆదర్శప్రాయమన్నారు.



అన్నదాన కార్యక్రమానికి సహకరించిన, హాజరైన ప్రముఖులను ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ తాము కేవలం నిమిత్త మాత్రులమేనని, అంతా దైవానుగ్రహమేనని తెలిపారు. బంధుమిత్రుల, దాతల సహకారం తమలో సేవాభావాన్ని పెంచిందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె. రవీందర్ రెడ్డి, ఆలయ ఈఓ ఎస్.సత్యనారాయణ, ఆలయ మాజీ చైర్మన్ మేకల దామోదర్ రెడ్డి, ఉత్సవ కమిటి సభ్యులు కాసుల మల్లికార్జున్, డి. జనార్దన్ రెడ్డి, శ్రీ వీరభద్రసేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధానకార్యదర్శి కాసుల వినోద్, కాసుల శ్వేత, శకుంతల, నర్రా దేవేందర్, విజయ్ భారతి, కొండూరు వినోద్ కుమార్, సంజన, విశ్వనాథం, విజయ, సంధ్య, శ్యామ్, అండాలు, రాణి, కాసుల రమణ, స్రవంతి, కాసుల మల్లికార్జున్, స్వాతి, కాసుల చంద్రుడు, లక్ష్మీ, మౌనిక, నర్రా సాయి, కిషోర్, శివాని, తదితరులు పాల్గొన్నారు.

# 18 నుంచి తిరుమల మే కోటా టికెట్లు

## 18న ఆర్జిత సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ ప్రారంభం.. 24న ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు విడుదల

తిరుమల, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక ప్రకటన చేసింది. 2026 మే నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసేందుకు తేదీల వారీగా షెడ్యూల్‌ను ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను గమనించి టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది.

**తేదీల వారీగా కోటా విడుదల వివరాలు:**

ఫిబ్రవరి 18: సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ ప్రక్రియ ఫిబ్రవరి 18న ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. భక్తులు ఫిబ్రవరి 20 ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన వారు ఫిబ్రవరి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించి, టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

**ఫిబ్రవరి 21:** కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను అందుబాటులోకి తేనున్నారు.



**ఫిబ్రవరి 23:** ఈ రోజున మూడు వేర్వేరు కోటాలను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

**ఫిబ్రవరి 24:** భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు.

**ఫిబ్రవరి 27:** ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది.

భక్తులు తమకు కావాల్సిన సేవలు, దర్శన టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## మార్చి 3న శ్రీవారి ఆలయం బంద్

తిరుమల, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): చంద్రగ్రహణం కారణంగా మార్చి 3వ తేదీన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని మూసివేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. ఈ మేరకు ఆలయ అధికారులు కీలక ప్రకటన విడుదల చేశారు. ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం, గ్రహణానికి ఆరు గంటల ముందుగా ఆలయ ద్వారాలను మూసివేయడం సంప్రదాయం. మార్చి 3న మధ్యాహ్నం 3:20 గంటల నుంచి సాయంత్రం 6:47 గంటల వరకు చంద్రగ్రహణం ఉండటంతో, అదే రోజు ఉదయం 9 గంటలకే ఆలయ తలుపులు మూసివేస్తారు. గ్రహణం ముగిసిన తర్వాత, సాయంత్రం 7:30 గంటలకు ఆలయాన్ని తిరిగి తెరుస్తారు. దీంతో సుమారు 10.30 గంటల పాటు శ్రీవారి దర్శనాలు నిలిచిపోనున్నాయి. ఆలయ తలుపులు తెరిచిన తర్వాత శుద్ధి, పుణ్యాహవచనం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించి, రాత్రి 8:30 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. గ్రహణం కారణంగా ఆ రోజు నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలతో పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా రద్దు చేశారు. ఇదే రోజు కుమారధార తీర్థం ముక్కోటి ఉత్సవాలు కూడా జరగనున్నాయని, వాటికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మార్పులను గమనించి, భక్తులు తమ తిరుమల యాత్రను తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

## అంబటి కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

గుంటూరు, ఫిబ్రవరి 16 (ఈర్తలు): మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది. ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరఫున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు.

## అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో సుడిగాలి

అనకాపల్లి, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): అనకాపల్లి పట్టణంలో అరుదైన, భారీ గాలి దుమారం స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఎన్టీఆర్ స్టేడియం వద్ద హఠాత్తుగా ఏర్పడిన ఈ సుడిగాలి సుమారు 20 మీటర్ల ఎత్తుకు చేరి, భయానక వాతావరణాన్ని సృష్టించింది. టోర్నడో తరహాలో బలమైన గాలులతో కూడిన ఈ సుడిగుండం స్టేడియంలోని దుమ్ము, ధూళి, చెత్తాచెదారాన్ని ఆకాశంలోకి ఎగరవేసింది. దీంతో ఆ ప్రాంతమంతా క్షణాల్లో ధూళి మేఘంలా మారిపోయింది. ఈ ఊహించని పరిణామాన్ని చూసిన స్థానికులు, క్రీడాకారులు భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. కొందరు తమ మొబైల్ ఫోన్లలో ఈ దృశ్యాలను బంధించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో, ఆ వీడియోలు వేగంగా వైరల్ అయ్యాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటిది చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై వాతావరణ నిపుణులు స్పందించారు. భూమి ఉపరితలం తీవ్రంగా వేడెక్కడం వల్ల పీడనం పెరిగి, గాలి వేగంగా పైకి లేచి సుడులు తిరుగుతుందని వివరించారు. సూర్యరశ్మి తీవ్రత, గాలి పీడనంలో మార్పుల వల్లే ఇలాంటి దుమారాలు ఏర్పడతాయని తెలిపారు.







# నేడు వైజాగ్‌లో నౌకాదళ విన్యాసాలు

## హాజరుకానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

వైజాగ్, ఫిబ్రవరి 16 (ఈవార్తలు): అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)లో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం విశాఖపట్నం రానున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయుధ దళాల సర్వ సైన్యాధ్యక్షురాలి హోదాలో రాష్ట్రపతి ఈ విన్యాసాలను సమీక్షిస్తారు. అంతర్జాతీయ నౌకాదళ ప్రతినిధులు, యుద్ధనౌకలు, జలాంతర్గాములు, విమానాలు ఒకచోటకి చేరి తమ శక్తిసామర్థ్యాలను ప్రదర్శించడమే ఐఎఫ్ఆర్ ముఖ్య ఉద్దేశం. మంగళవారం రాష్ట్రపతి గౌరవార్థం ఇచ్చే విందుతో ఐఎఫ్ఆర్-2026 కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు విశాఖ తీరంలో ఏర్పాటు చేసిన యాంకరేజ్ ప్రాంతంలో భారత్‌తో పాటు స్నేహపూర్వక దేశాలకు చెందిన సుమారు 70 యుద్ధనౌకల ఫ్లీట్‌ను రాష్ట్రపతి సమీక్షిస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారు. దేశాల మధ్య సముద్రయాన శక్తిని, సహకారాన్ని, స్నేహాన్ని ప్రదర్శించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని భారత నౌకాదళం వివరించింది. ఈసారి ఐఎఫ్ఆర్‌లో 'ఆపరేషన్ సిందూర్' హీరో, పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ నౌకాదళాన్ని కట్టడి చేయడంలో ఈ యుద్ధనౌక వ్యూహాత్మకంగా కీలకపాత్ర పోషించింది. మిత్ర దేశాల నౌకాదళాలు ఈ విమాన వాహక నౌకను సమీపం నుంచి పరిశీలించనున్నాయి. ఈసారి విశాఖ కేవలం ఐఎఫ్ఆర్‌కే కాకుండా మరో రెండు కీలక కార్యక్రమాలకు కూడా వేదికైంది. భారత నౌకాదళం ఆధ్వర్యంలో 13వ ఎడిషన్ మిలాన్-2026, హిందూ మహాసముద్ర నౌకాదళ సింపోజియం సదస్సు కూడా ఇక్కడే జరుగుతున్నాయి. 135కి పైగా దేశాలను మిలాన్ విన్యాసాలకు ఆహ్వానించారు. భారత్ ఈ మూడు ప్రధాన సముద్రయాన కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించడం ఇదే ప్రప్రథమం. భారత్‌లో తొలి ఐఎఫ్ఆర్‌ను 2001లో ముంబైలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ సమీక్షించారు. రెండోసారి 2016లో విశాఖపట్నంలో నిర్వహించగా, అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఇప్పుడు మూడోసారి జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా భారత నౌకాదళ శక్తి, అంతర్జాతీయ సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి.

# యూపీఐ.. తగ్గేదేలే!









**నగదు చెల్లింపులను దాటేసిన యూపీఐ**

**మొత్తం లావాదేవీల్లో 57 శాతం వాటా**

భారత్‌లో చెల్లింపుల విధానంలో యూపీఐ సరికొత్త విప్లవం సృష్టించింది. నగదు లావాదేవీలను వెనక్కి నెట్టి దేశంలో అత్యంత ప్రాధాన్య చెల్లింపుల విధానంగా అవతరించింది. దేశంలోని మొత్తం లావాదేవీల్లో యూపీఐ వాటా 57 శాతానికి చేరగా, నగదు వాటా 38 శాతానికి పరిమితమైందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక అధ్యయనంలో వెల్లడైంది.

న్యూఢిల్లీ: సులభమైన వినియోగం, తక్షణమే డబ్బు బదిలీ కావడం వంటి కారణాలతో యూపీఐకి ఆదరణ విపరీతంగా పెరిగింది. “రూపే డెబిట్ కార్డ్, తక్కువ విలువ గల భీమ్-యూపీఐ లావాదేవీల ప్రోత్సాహక పథకం యొక్క సామాజిక-ఆర్థిక ప్రభావ విశ్లేషణ” పేరుతో ఈ నివేదికను ఆర్థిక సేవల విభాగం విడుదల చేసింది. ఈ అధ్యయనం ప్రకారం, యూపీఐ వాడేవారిలో 65 శాతం మంది రోజుకు చాలాసార్లు డిజిటల్ చెల్లింపులు జరుపుతున్నారు. ముఖ్యంగా 18-25 ఏళ్ల యువతలో యూపీఐ వినియోగం 66 శాతంగా ఉంది. ఇది డిజిటల్ అలవాట్ల వైపు యువతరం ఎంతగా మొగ్గు చూపుతోందో స్పష్టం చేస్తోంది. చిన్న వ్యాపారుల్లో కూడా డిజిటల్ చెల్లింపుల స్వీకరణ భారీగా పెరిగింది. దాదాపు 94 శాతం మంది చిన్న వ్యాపారులు యూపీఐని వినియోగిస్తున్నారు. వేగవంతమైన లావాదేవీలు, సులభమైన రికార్డుల నిర్వహణ వల్ల 72 శాతం మంది వ్యాపారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఎన్‌పీసీఐ, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థల సమన్వయంతో దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ బలోపేతమైంది. ఈ పథకం అమలు సమయంలో డిజిటల్ లావాదేవీలు దాదాపు 11 రెట్లు పెరిగాయి. యూపీఐ ప్లాట్‌ఫామ్‌పై పనిచేసే బ్యాంకుల సంఖ్య 216 నుంచి 661కి పెరగడం విశేషం. ఈ మార్పుల వల్ల ఏటీఎంల నుంచి నగదు విత్‌డ్రాలు కూడా తగ్గుముఖం పట్టాయి.

## చైనా సరిహద్దులో కిరణ్ రిజిజు పర్యటన



న్యూఢిల్లీ: ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం వివాదం వేళ, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చైనా సరిహద్దుల్లో పర్యటించారు. ప్రచురితం కాని నరవణే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇలాంటి తరుణంలో చైనా సరిహద్దుకు దగ్గరలోని తన నియోజకవర్గం అరుణాచల్ వెస్ట్‌లో కేంద్రమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, పార్లమెంటు సజావుగా సాగడంపై రాహుల్ గాంధీకి ఆసక్తి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని కొన్ని ఎన్జీవోలు ఆయనకు చెప్పాయని, అందుకే పదేపదే సభను అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశ భద్రత విషయంలో రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు. ప్రచురితం కాని పుస్తకం గురించి చెప్పడానికి ఏముంటుందని కిరణ్ రిజిజు అన్నారు. ఆ పుస్తకం గురించి మనం మాట్లాడుకోకూడదని అన్నారు. అయితే రాహుల్ గాంధీ మాట్లాడింది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి తీవ్రంగా పరిగణించాలని అన్నారు. అలాంటి అంశాలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి సరిహద్దుల గురించి ఏమీ తెలియదని, అందుకే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. సరిహద్దుల గురించి ఆయన తెలుసుకుంటే మంచిదని సూచించారు.

## 1.5 కోట్లకు ప్రియురాలికి భర్త అమ్మకం

**భోపాల్ ఫ్యామిలీ కోర్టులో ఘటన**

భోపాల్: ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కించిన ఒక సినిమాలో భార్య తన భర్తను కోటి రూపాయలకు ప్రియురాలికి అమ్మేస్తుంది. ఆ సినిమాలో చూసినట్టుగానే నిజ జీవితంలోనూ జరిగింది. 23 ఏళ్ల వివాహ బంధాన్ని భార్య స్వయంగా ముగించి, తన భర్తను రూ.1.5 కోట్లకు ప్రియురాలికి అప్పగించింది. ఈ అసాధారణ ఒప్పందం భోపాల్ ఫ్యామిలీ కోర్టు సాక్షిగా జరగడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. వివరాల్లోకి వెళితే, 23 ఏళ్ల క్రితం ఈ భార్యాభర్తలకు వివాహం జరిగింది. ప్రస్తుతం ఆయనకు 42 ఏళ్లు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. అయితే, తన భర్త ఆయనతో పాటు పని చేస్తున్న 54 ఏళ్ల మహిళతో సంబంధం పెట్టుకుని కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ భోపాల్ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేసింది. కోర్టు ముగ్గురినీ కౌన్సెలింగ్‌కు పిలిచింది. అయితే భర్త 'నేను ఆమెతోనే ఉంటాను' అని స్పష్టం చేశాడు. దీంతో భార్య 'నా భర్తను అతని ప్రియురాలికి వదిలిపెట్టడానికి రూ.1.5 కోట్లు ఇవ్వాలి' అని డిమాండ్ చేసింది. ప్రియురాలు అంగీకరించడంతో ఒప్పందం జరిగింది. భార్యకు ఒక డూప్లెక్స్ ఇల్లు ఇవ్వడంతో పాటు, రూ.27 లక్షల నగదు చెల్లించారు. ఇప్పుడు ఆమె ఇద్దరు పిల్లలతో కొత్త ఇంట్లో స్థిరపడేందుకు సిద్ధమవుతోంది.

## రేణుకా చౌదరికి ప్రివిలేజ్ నోటీసులు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి సభా హక్కుల ఉల్లంఘన నోటీసు జారీ అయింది. గత శీతాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలోకి తన కారులో వీధికుక్కను తీసుకురావడం, ఎంపీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై రాజ్యసభ ప్రివిలేజ్ కమిటీ ఈ నోటీసు ఇచ్చింది. ఫిబ్రవరి 23వ తేదీలోగా ఈ ఆరోపణలపై రాతపూర్వక సమాధానం ఇవ్వాలని కమిటీ ఆమెను ఆదేశించింది. గతేడాది డిసెంబర్‌లో జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల సమయంలో రేణుకా చౌదరి.. తాను కాపాడిన ఒక వీధి కుక్కను తన కారులో పార్లమెంటుకు తీసుకొచ్చారు. దీనిపై కొందరు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయగా “లోపల కూర్చున్నవారే కరుస్తారు, కుక్కలు కరవవు” అని ఆమె వ్యాఖ్యానించినట్లు బీజేపీ ఎంపీలు బ్రిజ్‌లాల్, ఇందుబాల గోస్వామి తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపీలను అవమానించేలా, వారి పరువుకు నష్టం కలిగించేలా రేణుక మాట్లాడారని వారు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. ఈ ఫిర్యాదును రాజ్యసభ చైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. గత వారం సమావేశమైన కమిటీ ఈ అంశంపై చర్చించి, రేణుకా చౌదరి నుంచి వివరణ కోరాలని నిర్ణయించింది. ఈ నోటీసుపై రేణుకా చౌదరి కార్యాలయం స్పందించింది. పార్లమెంటరీ నిబంధనలు, సంప్రదాయాలకు అనుగుణంగా దీనిపై సమాధానం ఇస్తామని తెలిపింది.

## జడ్జికి రూ.50 లక్షల లంచం!?

**తమిళనాడు న్యాయవర్గాల్లో కలకలం**

చెన్నై: తమకు అనుకూలంగా తీర్పు వచ్చేలా చేసేందుకు మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తికి లంచం ఇవ్వాలంటూ ఓ సీనియర్ న్యాయవాది పిటిషనర్ల నుంచి రూ.50 లక్షలు తీసుకున్నారనే ఆరోపణ తమిళనాడు న్యాయవర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు 'ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్' అనే సంస్థ కేంద్ర న్యాయశాఖకు ఫిర్యాదు చేసింది. న్యాయశాఖ ఈ ఫిర్యాదును మద్రాస్ హైకోర్టుకు పంపడంతో ఈ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2008-09లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఇండియన్ మెటల్స్ అండ్ మినరల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్‌ను రూ.113.38 కోట్ల మేరకు మోసం చేశారనే ఆరోపణలపై నరేశ్ ప్రసాద్ అగర్వాల్, గణేశ్ అగర్వాల్‌పై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసు విచారణ మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. నిర్మల్ కుమార్ ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే, ఈ కేసులో అనుకూల తీర్పు కోసం న్యాయమూర్తికి రూ.50 లక్షలు ఇవ్వాలంటూ సీనియర్ న్యాయవాది మురళీకుమరన్ పిటిషనర్ల నుంచి డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు తన దృష్టికి రావడంతో జస్టిస్ నిర్మల్ కుమార్ తీవ్రంగా స్పందించారు. వెంటనే ఆ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా, ఈ లంచం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించారు. మరోవైపు, న్యాయవాది మురళీకుమరన్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. ఈ ఘటన ప్రస్తుతం న్యాయవ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## 3 రోజుల్లో 6,000 మంది ఊచకోత

**సూడాన్‌లో పారామిలిటరీ దళాల అరాచకం**

జెనీవా: సూడాన్‌లో పారామిలిటరీ దళాలు సృష్టించిన మారణకాండపై ఐక్యరాజ్యసమితి సంచలన నివేదికను విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ చివరిలో దార్ఫుర్ ప్రాంతంలో కేవలం మూడు రోజుల్లోనే రాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్) దళాలు 6,000 మందికి పైగా పౌరులను అత్యంత క్రూరంగా హతమార్చినట్లు తెలిపింది. ఈ హింస దిగ్భ్రాంతికరంగా ఉందని, ఇవి యుద్ధ నేరాలు, మానవత్వంపై ఘోరాలతో సమానమని ఐరాస మానవ హక్కుల కార్యాలయం తన నివేదికలో స్పష్టం చేసింది. నార్త్ దార్ఫుర్‌లోని ఎల్-ఫాషెర్ నగరాన్ని స్వాధీనం చేసుకునే క్రమంలో ఆర్ఎస్ఎఫ్, దాని మిత్రపక్ష అరబ్ మిలీషియాలు ఈ ఘాతుకాలకు పాల్పడ్డాయని శుక్రవారం విడుదల చేసిన 29 పేజీల నివేదికలో వివరించింది. సామూహిక హత్యలు, లైంగిక దాడులు, చిత్రహింసలు వంటి అనేక అకృత్యాలకు పాల్పడ్డారని పేర్కొంది. యూనివర్సిటీ ప్రాంగణంలో ఆశ్రయం పొందుతున్న వారిపై కాల్పులు జరపడంతో పాటు, పారిపోతున్న వారిని కూడా వదలకుండా చంపేశారని తెలిపింది. చాలా సందర్భాల్లో జాతి ప్రాతిపదికన ఈ దాడులు జరిగాయని నివేదిక వెల్లడించింది. సూడాన్ సైన్యానికి, ఆర్ఎస్ఎఫ్‌కు మధ్య ఏప్రిల్ 2023 నుంచి అంతర్యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఈ దాడులు జరిగాయి. “శిక్షలు పడవన్న ధీమానే హింస నిరంతరం కొనసాగేలా ప్రోత్సహిస్తోంది” అని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ ఆవేదన వ్యక్తం చేశారు. 140 మంది బాధితులు, సాక్షులను ఇంటర్వ్యూ చేసి, శాటిలైట్ చిత్రాలతో సరిపోల్చి ఈ నివేదికను రూపొందించినట్లు ఐరాస తెలిపింది. ఈ మారణకాండపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులను అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ముందు నిలబెట్టాలని పిలుపునిచ్చింది

## రెండు రోజుల నష్టాలకు బ్రేక్





ముంబై: రెండు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ వేస్తూ సోమవారం భారత స్టాక్ మార్కెట్లు భారీ లాభాలతో ముగిశాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లలో చివరి గంటలో వెల్లువెత్తిన కొనుగోళ్లతో సూచీలు పరుగులు పెట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 650.39 పాయింట్లు లాభపడి 83,277.15 వద్ద స్థిరపడింది. అలాగే, నిఫ్టీ 211.65 పాయింట్లు పెరిగి 25,682.75 వద్ద నిలిచింది. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 25,500-25,400 పాయింట్ల శ్రేణి కీలక మద్దతుగా ఉంది. ఈ స్థాయిని కాపాడుకున్నంత కాలం మార్కెట్ సానుకూలంగానే ఉంటుందని వారు అంచనా వేస్తున్నారు. ఎగువన 25,700-25,800 వద్ద నిరోధం ఉందని, దానిని దాటితే 25,900-26,000 స్థాయిలకు చేరవచ్చని విశ్లేషకులు తెలిపారు. ఈ రోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు మార్కెట్ రికవరీకి నాయకత్వం వహించాయి. సెన్సెక్స్ షేర్లలో పవర్ గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్ 4.5 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా వంటివి నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ, పీఎస్‌యూ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు, ఫార్మా షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించగా, ఆటో, మెటల్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. అయితే, క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్‌కు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనలను సవరించడంతో బీఎస్ఈ, ఏంజెల్ వన్, ఎంసీఎక్స్ వంటి షేర్లు 10 శాతం వరకు నష్టపోయాయి. మరోవైపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం 90.62 వద్ద దాదాపు స్థిరంగా ట్రేడ్ అయింది.

## మహిళల అకౌంట్లలోకి రూ.10 వేలు

**భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్**

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీ-జేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు. ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## మొరాయించిన ఎక్స్.. యూజర్ల అవస్థలు




న్యూఢిల్లీ: ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, ఎలాన్ మస్క్ నేతృత్వంలోని 'ఎక్స్' సేవలు సోమవారం సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా నిలిచిపోయాయి. భారత్‌తో పాటు అమెరికా, యూకే వంటి అనేక దేశాల్లో యూజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ అకౌంట్లలోకి లాగిన్ అవ్వలేకపోవడం, కొత్త పోస్టులు లోడ్ కాకపోవడంతో గందరగోళానికి గురయ్యారు. కొద్ది గంటల పాటు కొనసాగిన ఈ అంతరాయంతో ఎక్స్ వేదికపై కార్యకలాపాలు స్తంభించిపోయాయి. టెక్నికల్ సమస్యలను గుర్తించే వెబ్‌సైట్ 'డౌన్ డిటెక్టర్' ప్రకారం, ఈ అంతరాయంపై ఫిర్యాదుల సంఖ్య అనూహ్యంగా 25,000 దాటింది. వీరిలో 53 శాతం మంది ఎక్స్ యాప్ యూజర్లు లాగిన్ సమస్యలను ఎదుర్కొన్నట్లు నివేదించారు. అదే సమయంలో 16 శాతం మంది వెబ్‌సైట్ యూజర్లు కూడా ఇబ్బందులు పడినట్లు డౌన్ డిటెక్టర్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, ఈ సాంకేతిక సమస్యకు కచ్చితమైన కారణం ఏంటనేది వెంటనే తెలియరాలేదు. దీనిపై వివరణ కోరగా ఎక్స్ యాజమాన్యం నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఎక్స్ సేవలు నిలిచిపోవడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది నవంబర్‌లో కూడా భారత్‌తో సహా ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది యూజర్లు ఇలాంటి అంతరాయాన్నే ఎదుర్కొన్నారు. అప్పుడు 'క్లౌడ్‌ఫ్లేర్' ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తలెత్తిన సమస్య కారణంగా ఎక్స్‌తో పాటు పలు ఇతర వెబ్‌సైట్లు కూడా డౌన్ అయ్యాయి. ఆ సమస్యను తర్వాత క్లౌడ్‌ఫ్లేర్ పరిష్కరించింది. ఆసక్తికరంగా, ఆ సమయంలో డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ కూడా క్లౌడ్‌ఫ్లేర్‌పై ఆధారపడటంతో అది కూడా లోడ్ అవ్వడానికి ఇబ్బంది పడింది. అంతకుముందు, గతేడాది మే నెలలో సైతం ఎక్స్ గ్లోబల్‌గా మొరాయించింది. అప్పుడు కూడా యూజర్లు కొత్త పోస్టులు చూడలేక, లాగిన్ అవ్వలేక ఇబ్బంది పడ్డారు. 24 గంటల వ్యవధిలో రెండుసార్లు సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ప్రపంచవ్యాప్తంగా 5,000 మందికి పైగా యూజర్లు సమస్యలను ఎదుర్కొన్నట్లు డౌన్ డిటెక్టర్ తెలిపింది. తరచూ ఇలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడం యూజర్లలో ఆందోళన కలిగిస్తోంది.

## భారత్‌లో ఆంత్రోపిక్ ఆఫీస్ ఓపెన్

**ఆసియాలో టోక్యో తర్వాత రెండోది.. భారత్ తమకు రెండో అతిపెద్ద మార్కెట్ అని వెల్లడి**




బెంగళూరు: అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఆంత్రోపిక్, భారత్‌లో అధికారికంగా తన కార్యకలాపాలు ప్రారంభించింది. సోమవారం బెంగళూరులో కొత్త కార్యాలయాన్ని తెరిచినట్లు ప్రకటించింది. ఆసియాలో టోక్యో తర్వాత ఆంత్రోపిక్ ఏర్పాటు చేసిన రెండో కార్యాలయం ఇది. స్థానికంగా వివిధ విభాగాల్లో ఉద్యోగులను నియమించుకోవడంపై దృష్టి సారించనున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. తమ ఏఐ టూల్ 'క్లాడ్'కు భారత్ రెండో అతిపెద్ద మార్కెట్ అని ఆంత్రోపిక్ పేర్కొంది. దేశంలో క్లాడ్ వినియోగంలో దాదాపు సగం వాటా కంప్యూటర్, గణిత సంబంధిత పనులకే ఉందని వివరించింది. “భారత్‌లో అపారమైన సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ మౌలిక వసతులు ఉన్నాయి. బాధ్యతాయుతమైన ఏఐ ప్రయోజనాలను ఎక్కువ మందికి అందించేందుకు ఇది గొప్ప అవకాశం” అని ఆంత్రోపిక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఇరినా ఘోష్ అన్నారు. ఈ సందర్భంగా భారత్‌లో విద్య, వ్యవసాయం, న్యాయ సేవలు వంటి పలు రంగాల్లో తమ భాగస్వామ్యాలను కూడా ఆంత్రోపిక్ ప్రకటించింది. విద్యా రంగంలో 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపింది. ప్రథమ్ రూపొందించిన 'ఎనీటైమ్ టెస్టింగ్ మెషీన్'కు క్లాడ్ ఏఐ సాంకేతికతను అందిస్తున్నామని, ప్రస్తుతం 20 స్కూళ్లలో 1,500 మంది విద్యార్థులతో పైలట్ ప్రాజెక్ట్ నడుస్తోందని, 2026 చివరి నాటికి దీన్ని 100 పాఠశాలలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించింది. అలాగే, న్యాయ సేవల యాక్సెస్‌ను మెరుగుపరిచేందుకు 'అదాలత్ ఏఐ'కు సహకారం అందిస్తున్నట్లు తెలిపింది. దీని ద్వారా వాట్సాప్ హెల్ప్‌లైన్ ద్వారా కోర్టు కేసుల అప్‌డేట్స్, పత్రాల అనువాదం, సారాంశం వంటి సేవలను ప్రాంతీయ భాషల్లో పొందవచ్చని పేర్కొంది. అక్టోబర్ 2025 నుంచి భారత్‌లో తమ రెవెన్యూ రెట్టింపు అయిందని కంపెనీ వెల్లడించింది.

## త్వరలో రూ.లక్షలోపు బంగారం?


**స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ జోస్యం**

ముంబై: బంగారం ధరలు సమీప భవిష్యత్తులో భారీగా పడిపోయే అవకాశం ఉందని, 2027 చివరి నాటికి 10 గ్రాముల బంగారం ధర రూ.లక్ష లోపునకు దిగిరావొచ్చని ప్రముఖ ఆర్థికవేత్త, పేస్ 360 చీఫ్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ అమిత్ గోయల్ సంచలన అంచనా వేశారు. ఇటీవలి కాలంలో రికార్డు గరిష్ఠాలకు చేరిన పసిడి ధరలు ఇప్పటికే కొంతమేర తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో, ఈ కరెక్షన్ మరింత లోతుగా ఉండబోతోందని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు సుమారు 5,000 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది జనవరిలో నమోదైన గరిష్ఠ స్థాయి 5,626 డాలర్లతో పోలిస్తే తక్కువే. ఇక భారత మార్కెట్లో 10 గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,56,200 వద్ద ఉంది. జనవరిలో నమోదైన ఆల్-టైమ్ హై రూ.1,80,779తో పోలిస్తే ఇది ఇప్పటికే 13.5% పతనం. ఈ నేపథ్యంలో అమిత్ గోయల్ మాట్లాడుతూ, “2027 చివరి నాటికి కామెక్స్ గోల్డ్ ధర ఔన్సుకు 3,000 డాలర్ల స్థాయికి, భారత మార్కెట్లో తులం బంగారం ధర రూ.90,000 నుంచి రూ.1,00,000 మధ్యకు స్థిరపడవచ్చు” అని ఫిబ్రవరి 15న ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. మారుతున్న ప్రపంచ రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా రష్యా తిరిగి అమెరికా డాలర్లతో వాణిజ్య లావాదేవీలు ప్రారంభించవచ్చనే వార్తలు ఇందుకు కారణంగా నిలుస్తాయని ఆయన విశ్లేషించారు. అదే జరిగితే, డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకునే (డీ-డాలరైజేషన్) ఒత్తిడి తగ్గి, సెంట్రల్ బ్యాంకులు బంగారం కొనుగోళ్లను తగ్గించే అవకాశం ఉందని వివరించారు. అమిత్ గోయల్ గత కొంతకాలంగా బంగారం ధరలు అధికంగా ఉన్నాయని హెచ్చరిస్తూనే ఉన్నారు. 2025 ఆగస్టులో ఔన్సు బంగారం ధర 3,335 డాలర్లుగా ఉన్నప్పుడు, అది 2,800 డాలర్లకు పడిపోతుందని ఆయన అంచనా వేశారు. అయితే, మార్కెట్ ఆయన అంచనాలకు విరుద్ధంగా కదిలి, 2026 జనవరి నాటికి రికార్డు స్థాయికి చేరింది. అయినప్పటికీ తన హెచ్చరికలను కొనసాగించిన ఆయన, ఈ పెరుగుదలను “క్లాసిక్ కమోడిటీ బబుల్”గా అభివర్ణించారు. ప్రస్తుతం ధరలు తగ్గుముఖం పట్టడం ఆయన విశ్లేషణకు పాక్షికంగా బలం చేకూరుస్తోంది. అయితే, జేపీ మోర్గాన్, ఏఎన్‌జెడ్ వంటి ఇతర సంస్థల విశ్లేషకులు మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సెంట్రల్ బ్యాంకులు, ఇన్వెస్టర్ల నుంచి డిమాండ్ కొనసాగుతుందని, 2026 చివరి నాటికి బంగారం ధర ఔన్సుకు 5,000-5,800 డాలర్ల స్థాయికి చేరవచ్చని వారు అంచనా వేస్తున్నారు. లైవ్‌మింట్, మనీకంట్రోల్, రాయిటర్స్ వంటి పలు వార్తా సంస్థల కథనాల ప్రకారం, మార్కెట్ ప్రస్తుతం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు, భౌగోళిక రాజకీయ పరిణామాలపై ఆధారపడి తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతోంది. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.





శోభిత రాణా



## నెట్టింట్లో విజయ్-రష్మిక వెడ్డింగ్ కార్డు వైరల్




రాజస్థాన్ లో జైపూర్ లోని ఉదయపూర్ లో ఉన్న ఒక గ్రాండ్ ప్యాలెస్ లో రష్మిక-విజయ్ దేవరకొండ వివాహం చేసుకోబోతున్నారని, ముఖ్యంగా ఫిబ్రవరి 26న కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య వివాహం జరగబోతోంది అంటూ వార్తలు వినిపించాయి. అయితే ఇప్పుడు తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఫిబ్రవరి 26న వీరి వివాహం ఉదయపూర్ లోనే జరుగుతోంది. దీనికి తోడు మార్చి 4వ తేదీన రిసెప్షన్ కూడా ఉంటుంది. అందుకు తగ్గట్టుగానే అటు విజయ్ దేవరకొండ కూడా తెలంగాణ ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డిని వ్యక్తిగతంగా కలిశారు. అయితే అక్కడి నుండి బయటకు వచ్చిన ఫోటోలు జనరల్‌గా కనిపించినా.. ఆయన మాత్రం తన ఇన్విటేషన్ కార్డు ఇవ్వడానికే వెళ్లినట్లు సమాచారం. అయితే, వీరిద్దరి పెళ్లికి సంబంధించిన ఒక వెడ్డింగ్ కార్డు సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోంది. అంతేకాదు హైదరాబాదు వేదికగా జరిగే రిసెప్షన్ కి సంబంధించిన వెన్యూ కూడా అందులో ఉండడం గమనార్హం. హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న తాజ్ కృష్ణ హోటల్లో 4 మార్చి 2026 సాయంత్రం 7:00 గంటల నుండి రిసెప్షన్ జరగనుంది అంటూ ఒక వెడ్డింగ్ కార్డు నెట్టింట చక్కర్లు కొడుతోంది. అయినా సరే వీరిద్దరి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం.

## మాటల్ని అదుపులో పెట్టుకోవాలి: త్రిష

తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నైనార్ నాగేంద్రన్‌పై త్రిష లీగల్గా స్పందించింది. త్రిష తరుపు న్యాయవాది నిత్యేష్ నటరాజన్ కీలక ప్రకటన చేస్తూ లీగల్ యాక్షన్‌కు సంబంధించిన ఓ లెటర్‌ని సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. అవమానం ఎప్పుడైనా అవమానమే. స్థానం పెద్దదైతే బాధ్యత కూడా పెద్దదే. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాల కోసం లాగడటం సరైంది కాదు. గౌరవం ఇవ్వకపోయినా ఫరవాలేదు కనీసం అవమానించకండి- అంటూ తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌పై ఫైర్ అయ్యారు. నా క్లైంట్ త్రిష కృష్ణన్ పేరు మోసిన ఇండియన్ యాక్టర్. నా క్లైంట్‌పై చేసిన అసహ్యకరమైన వ్యాఖ్యలు మీడియాలో సర్క్యులేట్ అవుతున్నాయి. వాటి ఆధారంగానే ఈ ప్రకటన చేస్తున్నాం. నా క్లైంట్ త్రిష ఇలాంటి అవమానకరమైన అసహ్యమైన వ్యాఖ్యలని రాష్ట్ర రాజకీయాల్లో హై స్టేచర్ ఉన్న వ్యక్తి నుంచి వస్తాయని ఊమించలేదు' అని పేర్కొన్నారు. కాగా, హీరోయిన్ త్రిషకు బీజేపీ నేత నాగేంద్రన్ క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు.





## రాజ్‌పాల్‌కి బెయిల్

రూ.9 కోట్ల చెక్ బౌన్స్ కేసులో అరెస్టు అయ్యి జైలుకెళ్లిన బాలీవుడ్ హాస్య నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు ఢిల్లీ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. 2012లో తన మొదటి దర్శకత్వ చిత్రం -అతా పతా లాపతా- కోసం తీసుకున్న అప్పు, వడ్డీతో కలిపి ఇంత పెద్ద మొత్తానికి చేరుకోగా చివరకు అది జైలు శిక్ష వరకు వెళ్లింది. అయితే బెయిల్ ఇచ్చిన కోర్టు కొన్ని కఠిన షరతులు విధించింది. కేవలం 1.5 కోట్లు జమ చేసినందున కోర్టు ఆయన శిక్షను తాత్కాలికంగా మాత్రమే నిలిపివేసింది. అలాగే అతడి పాస్‌పోర్ట్ ను స్వాధీనం చేయాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని షరతు విధించింది. ఈ స్టే మార్చి 18 వరకు మాత్రమే వర్తిస్తుంది. అతడు 1 లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు అంతే మొత్తానికి ఒక షూరిటీని సమర్పించాలి. తన పాస్‌పోర్ట్‌ను కోర్టుకు అప్పగించాలి. మార్చి 18న జరిగే తదుపరి విచారణకు వ్యక్తిగతంగా లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరు కావాలి.

## నైటీ కంఫర్ట్ వర్ణనాతీతం: శివాని నాగారం

సుహాస్ హీరోగా హే భగవాన్ అనే సినిమాతో శివాని నాగారం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. త్వరలో విడుదల కానున్న సందర్భంగా ఒక యూట్యూబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె సినిమా జర్నీ గురించి చెపన్పింది. ఒక పాత్ర కోసం ఎప్పుడు చేయలేని పనులు కూడా చేయాల్సి వచ్చిందని, ముఖ్యంగా అందులో నైటీ వేసుకోవడం ఒకటని చెప్పి అందరిని ఆశ్చర్యపరిచింది. 'నాకు ఇప్పటివరకు నైటీ వేసుకోవడం రాదు.. కానీ మొదటిసారి లిటిల్ హార్ట్స్ సినిమాలో నైటీ వేసుకోమన్నారు. ఇక దాంతో నాకేం చేయాలో అర్థం కాక దర్శకుడితో సైజు కావాలి అని అడిగితే.. ఆయన నైటీకి ఏమి సైజులు ఉంటాయి శివానీ అని అడిగారు. ఇదే విషయాన్ని మా అమ్మకి చెబితే నైటీ వేసుకోవడం ఏంటి? అంటూ ఫస్ట్ ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత పింక్ కలర్ నైటీకి ఆమె ఫేవరెట్ పర్పుల్ కలర్ చున్నీ ఇచ్చి మరీ నన్ను షూటింగ్ కి పంపించింది. ఇక మా అమ్మ ఎంత స్వీటో అర్థం చేసుకోండి. ఈ నైటీ అనుభవం గురించి నా ఫ్రెండ్స్ కి చెబితే వినడమే తప్ప నాకు ఆ అనుభవం లేదు.. ఇక వారు కూడా నైటీ వేసుకుంటే వచ్చే ఆ ఫీలింగ్ నీకేం తెలుసు అనేవాళ్ళు. కానీ తొలిసారి లిటిల్ హార్ట్స్ సినిమా క్లైమాక్స్ లో నేను నైటీ ధరించాను. ఆ కంఫర్ట్ వర్ణనాతీతం. ఇక ఆ నైటీ వేసుకున్న తర్వాత అప్పుడే నేను హీరోయిన్ గా ఒక ఎత్తుకు ఎదిగాను అనిపించింది' అంటూ తన అభిప్రాయంగా చెప్పుకొచ్చింది.





## పీఆర్‌తో రియాలిటీకి దెబ్బ: శోభిత ధూళిపాళ్ల

ప్రస్తుతం సినీ రంగంలోని సెలబ్రిటీలు 24 గంటలూ మీడియాలో కనిపించడం, సోషల్ మీడియాలో నిరంతర ప్రచారం కొనసాగించడం, ప్రతీ చిన్న విషయాన్నీ హైలైట్ చేయించడం లాంటివి చాలా ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో శోభిత మాత్రం తనకు ఆ దారిలో నడవాలనే ఉద్దేశం లేదని తేల్చిచెప్పారు. తాను 24 గంటలు కనిపించాలని అనుకోనని, తాను ఎప్పుడూ వార్తల్లో ఉండాలనుకోనని, అది తన టార్గెట్ కాదని శోభిత చెప్పారు. పర్సనల్ లైఫ్, ప్రొఫెషనల్ లైఫ్ మధ్య క్లియర్ లైన్ ఉండాలని తాను అనుకుంటానని, అందుకే ఎక్కువ పీఆర్ తన వ్యక్తిత్వానికి సరిపోదని, అది వాస్తవికతను దూరం చేసే ప్రమాదం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే ప్రతీ యాక్టర్‌కీ తమ తమ ప్రాధాన్యతలుంటాయని, ఎవరినీ తప్పు పట్టే ఉద్దేశం తనకు లేదని కూడా క్లారిటీ ఇచ్చారు.

## నటుడు మోసం చేశాడు: మమత మోహన్‌దాస్

నటి మమతా మోహన్ దాస్ తన జీవితంలోని అత్యంత కష్టతరమైన ఎపిసోడ్స్ గురించి, వ్యక్తిగత నష్టాల గురించి ఇటీవల ఒక పాడ్ కాస్ట్‌లో వెల్లడించారు. ముఖ్యంగా ప్రేమలో నమ్మక ద్రోహం, మోసం గురించి చెప్పి ఆవేదన చెందారు. మమత ఒక ప్రముఖ మలయాళ నటుడితో ప్రేమలో ఉన్న సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాన్ని బయటపెట్టారు. ఓవైపు క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న క్లిష్ట సమయంలోనే ఆ నటుడితో ప్రేమలో ఉన్నానని చెప్పిన మమత, అతడికి అప్పటికే వేరే అమ్మాయితో నిశ్చితార్థం జరిగిందని.. ఆ విషయాన్ని దాచిపెట్టి తనను మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాదు తన మ్యారేజ్ లైఫ్ లో కలతల గురించి బహిరంగంగా మాట్లాడారు. తాను రెండో పెళ్లి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. 2011లో తన చిన్ననాటి స్నేహితుడు ప్రజిత్ పద్మనాభన్‌ను వివాహం చేసుకున్న మమత మనస్పర్థల కారణంగా కేవలం ఆరు నెలల్లోనే విడిపోయారు. 2012లో వారు అధికారికంగా విడాకులు తీసుకున్నారు. ఇటీవల సుహాసిని మణిరత్నం నిర్వహించిన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. సరైన వ్యక్తి దొరికితే మళ్లీ పెళ్లి చేసుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని మమతా మోహన్ దాస్ వెల్లడించారు.



## అమ్మకు రెండో పెళ్లి అబద్ధం : సుప్రీత

సురేఖావాణి రెండో పెళ్లి గురించి వార్తలొస్తూనే ఉన్నాయి. దీనిపై తాజా ఇంటర్వ్యూలో మరోసారి క్లారిటీ ఇచ్చింది సుప్రీత. అమ్మకు రెండో పెళ్లి చేయాలనే ఆలోచన కేవలం నాది మాత్రమేనని.. అమ్మకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. గతంలో మీ అమ్మ మళ్లీ పెళ్లి చేసుకుంటుందని మీరెప్పుడైనా ఆలోచించారా? అని నన్ను కొందరు అడిగారని పేర్కొంది. ఈ ప్రశ్నకు తాను అవును సమాధానమిచ్చానని సుప్రీత తెలిపింది. కానీ చాలామంది నా మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని వెల్లడించింది. నా మాటలు విని అమ్మ రెండో పెళ్లి చేసుకోబోతోందన్న వార్తలు రాసుకొచ్చారని పేర్కొంది. అదంతా పూర్తిగా అబద్ధమని.. అమ్మకు పెళ్లి చేసుకోవాలన్న ఆలోచనే లేదన్నారు. ఆమెకు మ్యారేజ్ చేయాలన్న ఆలోచన నాది మాత్రమేనని ఫుల్ క్లారిటీ ఇచ్చింది

# అయ్యయ్యో.. ఆసీస్



## లంక చేతిలో ఓటమి.. ఇక కంగారులు ఇంటికే!




ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఆస్ట్రేలియా పోరాటం దాదాపు ముగిసింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైన ఆసీస్ సూపర్-8 రేసు నుంచి అనధికారికంగా తప్పుకుంది. గ్రూప్-బీలో భాగంగా శ్రీలంకతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ఆసీస్ 8 వికెట్ల తేడాతో చిత్తయ్యింది.

శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సంక(52 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్స్‌లతో 100 నాటౌట్) అజేయ శతకంతో ఆసీస్ పతనాన్ని శాసించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్(27 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54), ట్రావిస్ హెడ్(29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీలతో రాణించగా మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో దుషన్ హేమంత(3/37) మూడు వికెట్లు తీయగా.. దుష్మంత చమీర(2/36) రెండు వికెట్లు పడగొట్టాడు. మహీష్ తీక్షణ, దునిత్ వెల్లలెగే, కామిందు మెండీస్ తలో వికెట్ తీసారు. అనంతరం శ్రీలంక 18 ఓవర్లలో 2 వికెట్లకు 184 పరుగులు చేసింది. పాతుమ్ నిస్సంక(52 బంతుల్లో 10 ఫోర్లు, 5 సిక్స్‌లతో 100 నాటౌట్) అజేయ శతకంతో సత్తా చాటగా.. కుశాల్ మెండీస్(38 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో రాణించాడు. పవన్ రత్నాయకే(15 బంతుల్లో 6 ఫోర్లతో 28 నాటౌట్) దూకుడుగా ఆడాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో మార్కస్ స్టోయినీస్(2/46) రెండు వికెట్లు తీసాడు. ఈ విజయంతో శ్రీలంక సూపర్-8 బెర్త్ ఖరారు చేసుకోగా.. ఆస్ట్రేలియా ఇంటి బాట పట్టింది. అద్భుతం జరిగితే తప్పా ఆసీస్ సూపర్-8 చేరలేదు. ఆ జట్టు ఒమన్‌తో ఆఖరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఆ మ్యాచ్‌లో గెలిస్తే ఆసీస్ ఖాతాలో 4 పాయింట్స్ చేరుతాయి. ఈ పరిస్థితుల్లో ఆసీస్ సూపర్-8 చేరాలంటే జింబాబ్వే తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో చిత్తుగా ఓడాలి. అప్పుడు ఐర్లాండ్, జింబాబ్వే, ఆసీస్‌లో మెరుగైన రన్ రేట్ ఉన్న జట్టుకు సూపర్-8 బెర్త్ దక్కుతుంది.




## పాక్ ఆటగాడికి ఇషాన్ క్షమాపణలు

భారత్-పాక్ మ్యాచ్‌లో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. టీమిండియా మ్యాచ్ విన్నర్ ఇషాన్ కిషన్.. పాక్ వికెట్ కీపర్ ఉస్మాన్ ఖాన్‌కు క్షమాపణలు చెప్పాడు. క్విక్ రన్ తీసే క్రమంలో ఇషాన్ కిషన్, ఉస్మాన్ ఖాన్ ఒకరినొకరు ఢీకొన్నారు. వాస్తవానికి ఉస్మాన్ ఖానే తనను ఢీకొట్టినప్పటికీ.. ఇషాన్ కిషన్ నవ్వుతూ క్షమాపణలు చెప్పాడు. పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా వేసిన మూడో ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ మూడో బంతిని స్వీప్ షాట్ ఆడిన ఇషాన్ కిషన్.. క్విక్ డబుల్ తీసాడు. క్రీజులోకి వచ్చే సమయంలో అతనికి అడ్డుగా పాక్ వికెట్ కీపర్ ఉస్మాన్ ఖాన్ రావడంతో ఒకరినొకరు ఢీకొట్టుకున్నారు. తన తప్పిదం లేకున్నా సారీ చెప్పి ఇషాన్ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాడు.




## సూపర్ 8లోకి ఇంగ్లండ్

**ఇటలీపై 24 రన్స్ తేడాతో గెలుపు**

టీ20 వరల్డ్‌కప్‌లో సోమవారం ఇటలీతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 24 రన్స్ తేడాతో నెగ్గింది. దీంతో ఆ జట్టు గ్రూపు సీ నుంచి సూపర్ 8లోకి వెళ్లింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 202 రన్స్ స్కోరు చేసింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇటలీ 178 రన్స్ చేసి ఆలౌటైంది. ఇటలీ ప్లేయర్ బెన్ మానెంటి 25 బంతుల్లో 60 రన్స్ చేసి కాసేపు దడపుట్టించాడు. అతని ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. జస్టిస్ మోస్కా 34 బంతుల్లో 43 రన్స్, గ్రాంట్ స్టీవార్ట్ 23 బంతుల్లో 45 రన్స్ చేశారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్ శరవేగంగా హాఫ్ సెంచరీ కొట్టాడు. కేవలం 22 బంతుల్లో అతను 53 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు.



## వసీం అక్రంతో రోహిత్ హగ్

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ నెటిజన్ల ఆగ్రహానికి గురయ్యాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న రోహిత్ శర్మ ఆదివారం కొలంబో వేదికగా జరిగిన భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా సతీసమేతంగా హాజరయ్యాడు. మ్యాచ్ ప్రారంభానికి ముందు మెగా టోర్నీ బ్రాండ్ అంబాసిడర్‌గా ట్రోఫీని మైదానంలోకి తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా పాకిస్థాన్ మాజీ కెప్టెన్, దిగ్గజ ప్లేయర్ వసీం అక్రమ్‌తో కరచాలనం చేయడంతో పాటు హగ్ చేసుకున్నాడు. అయితే ఈ వ్యవహారంపై భారత అభిమానులతో పాటు పాకిస్థాన్ ఫ్యాన్స్, మాజీ క్రికెటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఆటగాళ్లు.. పాకిస్థాన్ ప్లేయర్లతో కరాచాలనం చేయడం లేదు. పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, టీమ్‌మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో వసీం అక్రమ్‌ను రోహిత్ శర్మ హగ్ చేసుకోవడంపై నెటిజన్లు మండిపడుతున్నారు. పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు అహ్మద్ షెహజాద్, మహమ్మద్ అమీర్‌లు కూడా ఈ చర్యను తప్పుబట్టారు.




## బాబర్, షాహిన్‌పై వేటు?

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాజయం నేపథ్యంలో జట్టు ప్రదర్శనపై పాకిస్థాన్ మేనేజ్‌మెంట్ ఆగ్రహంతో ఉన్నట్లు పీసీబీ అధికారి ఒకరి మీడియాకు తెలిపారు. ఓటమి తర్వాత అర్ధరాత్రి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించారు. పాకిస్థాన్ ఓటమికి కారణమైన సీనియర్ ప్లేయర్స్ బాబర్ ఆజామ్, షాహిన్ అఫ్రిదిపై వేటు వేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వారి స్థానాల్లో సల్మాన్ మీర్జా, నసీమ్, ఫకర్, ఖవాజా పేర్లను నమీబియాతో మ్యాచ్‌కు పరిశీలిస్తున్నట్లు స్పష్టం చేశారు. భారత్‌తో మ్యాచ్‌లో బాబర్ ఆజామ్ 5 పరుగులే చేసి వెనుదిరగ్గా.. షాహిన్ షా అఫ్రిది రెండు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 31 పరుగులు సమర్పించుకున్నాడు. దాంతో ఈ ఇద్దరిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. వరుసగా విఫలమవుతున్నా.. ఈ ఇద్దర్నీ జట్టులో ఎందుకు కొనసాగిస్తున్నారని పాకిస్థాన్ మాజీ క్రికెటర్లు షోయబ్ అక్తర్, షాహిద్ అఫ్రిది ప్రశ్నించారు. షాహిన్ అఫ్రిది తన అల్లుడైనా సరే మెరుగైన ప్రదర్శన లేకుంటే జట్టు నుంచి తొలగించాలని డిమాండ్ చేశాడు. అక్తర్ అయితే పీసీబీ ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీపై ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అసమర్థుడిని అందలం ఎక్కిస్తే ఫలితం ఇలానే ఉంటుందని విమర్శించాడు. తానే సెలెక్టర్ అయితే బాబర్ ఆజామ్‌తో పాటు షాహిన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్‌లను జట్టు నుంచి తప్పించేవాడినని తెలిపాడు.



## యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ గెలుపు

యూఏఈపై ఆఫ్ఘనిస్తాన్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. షోయబ్ ఖాన్ (68) అర్ధ సెంచరీతో రాణించగా.. అలీషాన్ షరాఫు (40) పర్వాలేదనిపించాడు. ఆఫ్ఘన్ బౌలర్లలో అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 4 వికెట్లతో చెలరేగాడు. ముజీబ్ రెహ్మాన్ 2, రషీద్ ఖాన్ ఓ వికెట్ సాధించారు. ఈ వికెటే రషీద్‌కు టీ20ల్లో 700వ వికెట్. అనంతరం బరిలోకి దిగిన ఆఫ్ఘనిస్తాన్ 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇబ్రహీం జద్రాన్ (53) ఆఫ్ఘన్ గెలుపుకు పునాది వేయగా.. ఒమర్‌జాయ్ (40 నాటౌట్) తన జట్టును విజయతీరాలకు చేర్చాడు.

## నఖ్వీపై అక్తర్ ఫైర్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాజయంపై పాకిస్థాన్ మాజీ పేసర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఏం తెల్వనోడికి పెత్తనం ఇస్తే ఫలితాలు ఇలానే ఉంటాయని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్‌సిన్ నఖ్వీని ఉద్దేశించి విమర్శలు గుప్పించాడు. పాక్ సీనియర్ ఆటగాళ్లైన బాబర్ ఆజామ్, షాహిన్ అఫ్రిది, షాదాబ్ ఖాన్ పేలవ ప్రదర్శన కనబరుస్తున్నా.. వారిని ఎందుకు జట్టులో కొనసాగిస్తున్నారని ప్రశ్నించాడు. 'మోహ్‌సిన్ నఖ్వీకి తాను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ అన్న సంగతి గుర్తుందా? ఏం తెలియని వ్యక్తికి పీసీబీ పగ్గాలు ఇచ్చారు. ఇలా ఉంటే జట్టు ఎలా ముందుకు నడుస్తుంది? మీరు ఒక వ్యక్తిని సూపర్ స్టార్ అన్నారు. కానీ అతను ఒక్క మ్యాచ్ కూడా గెలిపించలేదు. ఇలాంటి స్టార్లను తయారు చేసి ఎంచుకుంటే ఫలితాలు ఇలానే ఉంటాయి. ప్రపంచంలో అతిపెద్ద నేరం ఏంటంటే అసమర్థుడిని తీసుకొచ్చి అందలం ఎక్కించడం. సామర్థ్యం లేని వ్యక్తిని ఉన్నత స్థానంలో కూర్చోబెడితే అతను దేశాన్ని నాశనం చేస్తాడు. సొంత వ్యవస్థనే కూలదోస్తాడు. అందుకు ఉదాహరణ మోహ్‌సిన్ నఖ్వీనే' అని అక్తర్ మండిపడ్డాడు.

## జియో హాట్‌స్టార్ ఆల్‌టైమ్ రికార్డ్

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన హైఓల్టేజ్ మ్యాచ్‌తో అధికార బ్రాడ్‌కాస్టర్ జియో హాట్‌స్టార్ పంట పండింది. ఈ మ్యాచ్‌లో భారత్ ఆధిపత్యం చెలాయించి మ్యాచ్‌ను ఏకపక్షంగా ముగించినా..వ్యూయర్‌షిప్‌లో మాత్రం సరికొత్త రికార్డ్ నమోదైంది. ఈ మ్యాచ్‌కు 45.4 కోట్ల కాన్‌కరెంట్ వ్యూస్ వచ్చాయని జియో హాట్‌స్టార్ అధికారికంగా ప్రకటించింది. క్రికెట్ చరిత్రలోనే ఇది సరికొత్త రికార్డ్. క్రికెట్ లైవ్ మ్యాచ్‌లు డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్ వేదికగా అందుబాటులోకి వచ్చాక వ్యూస్ విపరీతంగా పెరిగాయి. ఇప్పటి వరకు క్రికెట్ చరిత్రలో ఒకే సమయంలో అత్యధికంగా చూసిన మ్యాచ్ 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ (భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా). దీనికి 5.9 కోట్ల లైవ్ కాన్‌కరెంట్ వ్యూస్ వచ్చాయి. అయితే జియో హాట్ స్టార్ తాజాగా ప్రకటించిన వ్యూస్.. మ్యాచ్ మొదలైనప్పటి నుంచి చివరి వరకు వచ్చి వెళ్లిన మొత్తం జనాభా సంఖ్య. కానీ లైవ్ కాన్‌కరెంట్ వ్యూయర్‌షిప్ అంటే ఒకే సమయంలో లైవ్‌లో ఉన్నవారు. భారత్-పాక్ మ్యాచ్‌కు ఈ సంఖ్య 6 కోట్లుగా ఉన్నట్లు సమాచారం.



ఈవార్తలు సజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 17-2-2026



భారత సమాజం 21వ శతాబ్దంలో సాంకేతిక విప్లవం, సమాచార విస్తరణ, విద్యావ్యాప్తి వంటి అంశాలతో వేగంగా మార్పులకు లోనవుతున్నప్పటికీ తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో ప్రాచీన కులకట్టుబాట్లు ఇప్పటికీ బలంగా కొనసాగుతున్నాయి. ఆధునిక రాజ్యాంగ వ్యవస్థ అమల్లో ఉన్నా గ్రామీణ జీవన విధానాన్ని నియంత్రిస్తున్నది చట్టం కన్నా సామాజిక ఆచారాలేనన్న వాస్తవం తరచూ వెలుగులోకి వస్తోంది. గ్రామ సమాజంలో కులమే వ్యక్తి గుర్తింపుగా మారిన పరిస్థితి నేటికీ ప్రశ్నించలేని స్థితిలో ఉంది.

**ప్రాచీన గ్రామీణ వ్యవస్థ: 1800-1947**

**1800ల నుంచి 1947 వరకు తెలంగాణ గ్రామీణ వ్యవస్థ ప్రధానంగా కులాధారితంగా కొనసాగింది. వ్యవసాయం కేంద్రంగా ఉన్న ఆర్థిక నిర్మాణంలో భూమి కలిగిన కులాలకే అధికార స్థానం లభించింది. గ్రామ పెద్దలు, పంచాయతీలు, సామాజిక నిర్ణయాలు అన్నీ ఒక నిర్దిష్ట కులాధిపత్యానికి లోబడి ఉండేవి. అంచనాల ప్రకారం 1900 ప్రాంతంలో గ్రామీణ తెలంగాణలో సుమారు 90% ప్రజలు సంప్రదాయ కుల వృత్తులపైనే ఆధారపడి జీవించారు. ఈ కాలంలో కులం నుంచి బయటకు రావాలన్న ఆలోచననే నేరంగా పరిగణించే పరిస్థితి కనిపించింది.**

# తెలంగాణం.. కుల సమాజం!



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

### స్వాతంత్ర్యానంతర మార్పులు: 1947-1960

1947లో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రాజ్యాంగం ద్వారా సమానత్వం, మానవ హక్కులు, అంటరానితనం నిర్మూలన వంటి అంశాలు చట్టబద్ధమయ్యాయి. అయినప్పటికీ గ్రామీణ తెలంగాణలో ఈ మార్పులు ఆచరణలోకి రావడానికి చాలాకాలం పట్టింది. 1950-1960 మధ్య కాలంలో కేవలం 20% గ్రామాల్లో మాత్రమే కుల వివక్షపై ప్రశ్నించే ధోరణి కనిపించింది. గ్రామ పెద్దల తీర్పులే చట్టంగా కొనసాగాయి. బాల్య వివాహాలు, కులాంతర సంబంధాలపై శిక్షలు, బహిష్కరణలు సాధారణంగా కొనసాగాయి.

### అభివృద్ధి యుగం అని చెప్పుకున్న కాలం: 1960-1980

ఈ కాలంలో విద్య విస్తరణ మొదలైనా గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలలు పరిమితంగా ఉండటంతో సామాజిక అవగాహన ఆశించిన స్థాయిలో పెరగలేదు. 1971 జనగణన ప్రకారం గ్రామీణ తెలంగాణలో అక్షరాస్యత రేటు కేవలం 24% మాత్రమే. ఈ కాలంలో కుల పంచాయతీలు మరింత వ్యవస్థీకృతంగా పనిచేశాయి. మంత్రాలు, యంత్రాలు, మూఢనమ్మకాల పేరిట దాడులు చోటుచేసుకున్నాయి. గ్రామ సమాజం శాస్త్రీయ ఆలోచనలను తిరస్కరించిన దృశ్యం కనిపించింది.

### రాజకీయ చైతన్యం పెరిగిన దశ: 1980-2000

1980 తరువాత రాజకీయ ఉద్యమాల ప్రభావంతో కొంత మార్పు కనిపించింది. దళిత, బహుజన చైతన్యం పెరిగినా గ్రామ స్థాయిలో అది పరిమితంగానే నిలిచింది. 1991 నాటికి బాల్య వివాహాల రేటు గ్రామీణ తెలంగాణలో 45%గా నమోదు అయింది. కులాంతర వివాహాలపై హింసాత్మక చర్యలు కొనసాగాయి. గ్రామం నుంచి వెలివేయడం అనే శిక్ష ఇప్పటికీ అమల్లో ఉంది. ఈ దశలో చట్టాలున్నా అమలు బలహీనంగా ఉండటం ప్రధాన సమస్యగా మారింది.

### గ్లోబలైజేషన్ తరువాత కూడా మారని గ్రామం: 2000-2014

2000 తరువాత సమాచార సాంకేతికత గ్రామాలకు చేరినప్పటికీ సామాజిక ఆచారాల్లో మార్పు తక్కువగానే కనిపించింది. టీవీ, మొబైల్ ఫోన్ వాడకం పెరిగినా కుల భావజాలం చెక్కుచెదరలేదు. 2011 గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాలలో సుమారు 30% ప్రజలు ఇప్పటికీ మూఢనమ్మకాల ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నారు. మంత్రాలు, దయ్యాలు, శాపాలు వంటి భావనలు గ్రామీణ జీవితంలో భయాన్ని సృష్టించాయి.

### తెలంగాణ రాష్ట్రం తరువాతి దశ: 2014-2025

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అభివృద్ధి వేగం పెరిగినా సామాజిక చైతన్యం అనుకున్నంతగా ముందుకు సాగలేదు. గ్రామీణ మౌలిక వసతులు మెరుగైనప్పటికీ సామాజిక నిర్మాణం పాత బాటలోనే కొనసాగింది. ఇటీవల జగిత్యాల జిల్లాలోని బీర్పూర్ మండలం పరిధిలో జరిగిన సంఘటన ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా చూపించింది. కుల బహిష్కరణకు గురైన వ్యక్తి మరణించిన తరువాత గ్రామస్తులు అతని ఇంటికి వెళ్లకపోవడం గ్రామీణ సమాజంలోని అమానవీయ ఆచారాలను బహిర్గతం చేసింది. ఇది ఒంటరి ఘటన కాదు. ఇటువంటి సంఘటనలు గత 10 సంవత్సరాలలో అనేక గ్రామాలలో నమోదయ్యాయి.

### చట్టాలు ఉన్నా ఎందుకు మార్పు లేదు?

భారతదేశంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, మూఢనమ్మకాల వ్యతిరేక నిబంధనలు ఉన్నా గ్రామీణ స్థాయిలో అవి ప్రభావవంతంగా అమలుకావడం లేదు. 2020-2024 మధ్య కాలంలో నమోదైన గ్రామీణ హింస ఘటనల్లో కేవలం 35% కేసుల్లోనే శిక్షలు పడినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. గ్రామ పెద్దల భయం, సామాజిక ఒత్తిడి, పోలీస్ వ్యవస్థపై నమ్మకం లేకపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

### సామాజిక మార్పు కోసం అవసరమైన దిశ:

గ్రామీణ వ్యవస్థలో మార్పు కేవలం చట్టాల ద్వారా సాధ్యం కాదు. విద్య ద్వారా ప్రశ్నించే ధోరణి పెరగాలి. గ్రామ స్థాయిలో శాస్త్రీయ దృక్పథం విస్తరించాలి. కులాధారిత నిర్ణయాలకు వ్యతిరేకంగా నిలబడే సామాజిక వేదికలు అవసరం. యువతను సామాజిక మార్పుకు నాయకులుగా తయారు చేయాలి. లేనిపక్షంలో ఆధునిక ప్రపంచంలో జీవిస్తున్నా మన గ్రామాలు మధ్యయుగ చీకటిలోనే చిక్కుకుపోయే ప్రమాదం ఉంది. తెలంగాణ గ్రామీణ సమాజం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కులకట్టుబాట్ల సంకెళ్లను విరిచేయాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ఆచారాలు సంస్కృతి పరిరక్షణ పేరుతో అమానవీయతకు దారి తీస్తే అవి ప్రశ్నించాల్సిందే. 1800 నుంచి 2025 వరకు జరిగిన మార్పులు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నాయి. చట్టం ఉన్నా చైతన్యం లేకపోతే మార్పు అసాధ్యం. గ్రామీణ సమాజాన్ని మానవీయ విలువల వైపు మళ్లించడమే నేటి అత్యవసర కర్తవ్యం. తెలంగాణ గ్రామీణ సమాజంలో కులకట్టుబాట్ల ప్రశ్న ఒక సామాజిక సమస్య మాత్రమే కాదు, అది చారిత్రక వారసత్వం, ఆర్థిక నిర్మాణం, అధికార సంబంధాలు, మానసిక స్థితిగతుల సమ్మేళనంగా రూపుదిద్దుకున్న సంక్లిష్ట వ్యవస్థ. 1800 నుంచి 2025 వరకు జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ఒక స్పష్టమైన అంశం బయటపడుతుంది. వ్యవస్థలు మారాయి, పాలకులు మారారు, రాజ్యాంగం వచ్చింది, సాంకేతికత విస్తరించింది, విద్యావ్యాప్తి పెరిగింది. అయినప్పటికీ గ్రామీణ స్థాయిలో కులం అనే భావన తన ఆధిపత్యాన్ని పూర్తిగా కోల్పోలేదు. ఇది కేవలం సంప్రదాయ పరిరక్షణ కాదు. ఇది సామాజిక అధికారాన్ని కాపాడుకునే ప్రక్రియ. గ్రామీణ వ్యవస్థలో కులం ఒక గుర్తింపు మాత్రమే కాదు, అది అవకాశాల పంపిణీ విధానం. భూమి యాజమాన్యం, నీటి వనరుల వినియోగం, ఆలయ పరిపాలన, గ్రామ నిర్ణయాధికారం, రాజకీయ ప్రతినిధిత్వం వంటి అంశాలు చాలా కాలంగా నిర్దిష్ట వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయి. ఈ కేంద్రీకరణ తరతరాలుగా కొనసాగడం వల్ల అసమానతలు సహజమైనవిగా కనిపించే స్థితి ఏర్పడింది. అసమానతలను ప్రశ్నించే వారు సమాజ విరోధులుగా ముద్రవేయబడే పరిస్థితి ఏర్పడింది. ఈ మానసిక నిర్మాణం విచ్ఛిన్నం కాకపోతే చట్టపరమైన మార్పులు పరిమిత ప్రభావమే చూపగలవు.

స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగం సమానత్వాన్ని హామీ ఇచ్చింది. అంటరానితనాన్ని నిషేధించింది. విద్యను హక్కుగా గుర్తించింది. అయినప్పటికీ చట్టపరమైన హామీ గ్రామీణ స్థాయిలో సామాజిక అంగీకారంగా మారడానికి గణనీయమైన కాలం అవసరమైంది. గ్రామ పెద్దల తీర్పులు అనధికారిక న్యాయవ్యవస్థగా కొనసాగడం, సామాజిక బహిష్కరణను శిక్షగా అమలు చేయడం, కులాంతర సంబంధాలను అపరాధంగా చూడడం వంటి ఆచారాలు సమాజంపై భయ వాతావరణాన్ని సృష్టించాయి. భయం ఉన్నచోట స్వేచ్ఛ వికసించదు. స్వేచ్ఛ లేకపోతే సమానత్వం రూపుదిద్దుకోదు. ఆర్థిక స్వావలంబన లేకపోవడం కులాధారిత ఆధిపత్యానికి మరొక ప్రధాన కారణం. భూమిలేని వర్గాలు భూస్వాములపై ఆధారపడే పరిస్థితి కొనసాగినంతకాలం సామాజిక స్వరాన్ని వినిపించడం కష్టమవుతుంది. ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉన్న గ్రామాల్లో ఆర్థిక బలహీనత సామాజిక విధేయతకు దారితీస్తుంది. దీనివల్ల అన్యాయాన్ని తెలిసినా ప్రశ్నించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ చక్రం విచ్ఛిన్నం కావాలంటే గ్రామీణ ఆర్థిక నిర్మాణంలో సమాన అవకాశాలు పెరగాలి. స్వయం ఉపాధి, సహకార వ్యవస్థలు, భూమి పంపిణీ పారదర్శకత వంటి అంశాలు బలోపేతం కావాలి. విద్య మార్పుకు కీలక శక్తి. అయితే విద్య అంటే కేవలం అక్షరాస్యత కాదు. విమర్శనాత్మక ఆలోచన, శాస్త్రీయ దృక్పథం, మానవ హక్కుల అవగాహన, రాజ్యాంగ విలువల పట్ల గౌరవం పెరగాలి. పాఠశాల స్థాయి నుంచే సమానత్వ భావన బలపడాలి. గ్రామీణ పాఠశాలల్లో సామాజిక శాస్త్ర బోధన జీవన అనుభవాలతో ముడిపడాలి. విద్యార్థులు తమ గ్రామ వాస్తవాలను విశ్లేషించే అవకాశాలు పొందాలి. ఈ విధంగా విద్య జీవన మార్పుకు దారితీసే శక్తిగా మారుతుంది.

మహిళల స్థానం కూడా కులవ్యవస్థతో ముడిపడి ఉంది. బాల్య వివాహాలు, కుల పరిమితులలో వివాహ నియంత్రణ, ఆస్తి హక్కుల లోపం వంటి అంశాలు మహిళల స్వేచ్ఛను పరిమితం చేశాయి. మహిళ సాధికారత పెరగడం కులాధిపత్యాన్ని సవాలు చేసే దిశగా ముందడుగు. మహిళా సంఘాలు, స్వయం సహాయక గుంపులు, విద్యావకాశాలు గ్రామీణ సమాజంలో మార్పుకు వేదికలుగా మారగలవు. మహిళ స్వతంత్ర ఆర్థిక స్థితి పొందినప్పుడు కుటుంబ స్థాయిలోనే సామాజిక ధోరణి మారడం ప్రారంభమవుతుంది. సాంకేతిక విస్తరణ గ్రామాలకు చేరింది. మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలు సమాచారం అందుబాటులోకి తెచ్చాయి. అయితే సమాచారం అందుబాటులో ఉండటం మాత్రమే చైతన్యానికి హామీ కాదు. సమాచారం విశ్లేషణ సామర్థ్యం పెరగాలి.



అపోహలు, మూఢనమ్మకాలు, తప్పుడు ప్రచారం సామాజిక మాధ్యమాల ద్వారా వేగంగా వ్యాపించే ప్రమాదం ఉంది. అందువల్ల డిజిటల్ అక్షరాస్యత కూడా అత్యవసరం. నిజానిజాలను గుర్తించే సామర్థ్యం పెరగాలి. చట్టాల అమలు బలోపేతం కావాలి. కేసులు నమోదు కావడం మాత్రమే సరిపోదు. దర్యాప్తు వేగవంతం కావాలి. బాధితులకు రక్షణ కలగాలి. గ్రామీణ ప్రాంతాల్లో న్యాయసేవలు సులభంగా అందుబాటులో ఉండాలి. లీగల్ అవగాహన శిబిరాలు, హెల్ప్ లైన్లు, ఉచిత న్యాయ సహాయం వంటి వ్యవస్థలు గ్రామస్థాయికి చేరాలి. పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెరగడం కూడా అవసరం. ప్రజలు భయపడకుండా ఫిర్యాదు చేయగల వాతావరణం ఏర్పడాలి.

సామాజిక వేదికల పాత్ర కీలకం. యువజన సంఘాలు, సాంస్కృతిక వేదికలు, పుస్తక క్లబ్బులు, గ్రామ సభలు సమానత్వ చర్చలకు స్థలం కల్పించాలి. ప్రజల మధ్య సంభాషణ పెరగాలి. వేరువేరు వర్గాల మధ్య పరస్పర అవగాహన పెరిగితే అపోహలు తగ్గుతాయి. సంభాషణ లేని సమాజంలో అపార్థాలు పెరుగుతాయి. అపార్థాలు విభేదాలకు దారి తీస్తాయి. రాజకీయ నాయకత్వం కూడా బాధ్యత వహించాలి. ఎన్నికల సమయంలో కుల ఆధారిత ధ్రువీకరణ ప్రోత్సహించడం సమాజాన్ని మరింత విభజిస్తుంది. అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలపై చర్చ జరగాలి. ప్రజా ప్రతినిధులు రాజ్యాంగ విలువలను గౌరవించే విధంగా ప్రవర్తించాలి. గ్రామీణ అభివృద్ధి పథకాలు సమాన పంపిణీకి దోహదపడాలి. సంస్కృతి పరిరక్షణ పేరుతో అమానవీయ ఆచారాలను సమర్థించడం ఆపాలి. సంస్కృతి అంటే స్థిరమైనది కాదు. అది కాలానుగుణంగా మారుతుంది. మానవ గౌరవాన్ని కాపాడని ఆచారం సంస్కృతి కాదు. అది అన్యాయం. ఈ అవగాహన పెరగాలి. గ్రామీణ సమాజంలో మంచి సంప్రదాయాలు ఉన్నాయి. సహకారం, పరస్పర ఆదరాభిమానాలు, పండుగల ఐక్యత వంటి విలువలు బలోపేతం కావాలి. అదే సమయంలో అసమానతను నిలబెట్టే ఆచారాలు విడిచిపెట్టాలి. 1800 నుంచి 2025 వరకు జరిగిన ప్రయాణం ఒక స్పష్టమైన పాఠాన్ని అందిస్తుంది. మార్పు అనేది సహజ ప్రక్రియ కాదు. అది సజాగ్రత్త కృషి ఫలితం. చట్టం మార్గం చూపుతుంది. విద్య దిశ నిర్దేశం చేస్తుంది. ఆర్థిక స్వావలంబన బలం ఇస్తుంది. సామాజిక చైతన్యం మార్పును స్థిరపరుస్తుంది. ఈ నాలుగు అంశాలు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామీణ సమాజం సమానత్వ దిశగా పయనిస్తుంది.

తెలంగాణ గ్రామాలు అభివృద్ధి సూచికల్లో ముందుకు సాగుతున్నాయి. రహదారులు మెరుగయ్యాయి. విద్యుత్ సరఫరా విస్తరించింది. సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. అయితే భౌతిక అభివృద్ధితో పాటు సామాజిక అభివృద్ధి కూడా సమానంగా సాగాలి. ఒక వ్యక్తి కులం కారణంగా అవమానించబడే పరిస్థితి ఉన్నంతకాలం అభివృద్ధి సంపూర్ణం కాదు. గ్రామ సభలో ప్రతి వ్యక్తి స్వరానికి విలువ లభించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుంది. చివరగా ఒక స్పష్టమైన నిర్ధారణ అవసరం. కులకట్టుబాట్ల సంకెళ్లను విరిచే ప్రక్రియ బాహ్య ఒత్తిడితో సాధ్యం కాదు. అది అంతర్గత అవగాహనతో ప్రారంభమవుతుంది. గ్రామస్థాయి చర్చలతో మొదలవుతుంది. పిల్లల విద్యతో బలపడుతుంది. మహిళల సాధికారతతో వేగవంతమవుతుంది. న్యాయవ్యవస్థ నమ్మకంతో స్థిరపడుతుంది. ఈ మార్గంలో నడిచినప్పుడే తెలంగాణ గ్రామీణ సమాజం మానవ గౌరవం, సమానత్వం, న్యాయం అనే విలువలపై ఆధారపడిన కొత్త దశలోకి ప్రవేశిస్తుంది. అప్పుడు మాత్రమే 1800 నుంచి కొనసాగుతున్న అసమానత చరిత్రకు ముగింపు పలికినట్టవుతుంది. 2025 తరువాతి కాలం సమాన హక్కుల యుగంగా గుర్తింపు పొందుతుంది. గ్రామం అనే పదం భయం కాదు, భరోసా అనే భావన కలిగించే దశకు చేరుతుంది. అదే నిజమైన సామాజిక విముక్తి. అదే అభివృద్ధి అసలు అర్థం.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.